KANCHARLA
# మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా | |
|---|---|---|---|
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | ఏలూరు |

మంగళవారం 19 మే 2026 పేజీలు : 16




# పెరిగిన ఇంధన ధరలు తగ్గించాలని
# వైఎస్సార్‌సీపీ నిరసనలు

వార్తలు లోపలి పేజీల్లో...



### కూటమి ప్రభుత్వంలో
## సంక్షేమ విప్లవం

- జూన్ 12 నుండి కొత్త వితంతు పింఛన్ల పంపిణీ
- త్వరలోనే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ విప్లవానికి నాంది పలికిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే - మిగతా వార్త 2లో




## అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాత్రంతా రోడ్డుపైనే మృతదేహం పక్కన బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన జక్కంపూడి రాజా

- మిగతా వార్త 2లో

## నకిలీ సర్టిఫికెట్లతో నయా దందా

- దుళ్ళ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి బర్త్ సర్టిఫికెట్ జారీ
- ఉపాధి హామీ కూలీని మోసగించిన వైనం - జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు



Form 5
(See Rule 8)

BIRTH CERTIFICATE

(Issued under Section 12/17 of the Registration of Births and Deaths Act, 1969.)

This is to certify that the following information has been taken from the original record of birth which is in the Register of Local area Grampanchayat DULLA of Mandal KADIAM of District EAST GODAVARI of State Andhra Pradesh of INDIA.

| | |
|---|---|
| Name | : Undamatla Rama Krishna |
| Sex | : Male |
| Date of Birth | : 19-06-2003 |
| Place of Birth | : DULLA |
| Name of The Father | : Undamatla Raju |
| Name of The Mother | : Undamatla Chintalu |
| Registration No | : 36 |
| Date of Registration | : 30-06-2003 |
| Date: | Seal |

రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళ గ్రామ పంచాయతీలో ఫేక్ సర్టిఫికెట్ల దందా నడుస్తోంది. బర్త్, డెత్, ప్లాన్ అప్రూవల్ సర్టిఫికేట్ ఏదైనా నకిలీ చేస్తూ దర్జాగా అమాయకుల నుండి సొమ్ములు దండుకుంటున్నారు. దుళ్ళ గ్రామ పంచాయతీలో ఔట్ సోర్సింగ్ పంచాయతీ ఉద్యోగి తోకల శ్రీనివాస్, మరో దళారి ముమ్మిడి దేవీ నాగేశ్వరావు తో కలిసి ఈ ఫేక్ సర్టిఫికెట్లతో దందా బాగోతం నడిపిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. దుళ్ళ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలి నాగిరెడ్డి గవరయ్య...తోకల శ్రీనివాసు, ముమ్మిడి దేవీ నాగేశ్వరావు చేతుల్లో మోసపోయి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ ను ఆశ్రయించటంతో ఈ మోసపు ఉదంతం వెలుగు చూసింది. గత ఫిబ్రవరి నెలలో తన మనమడు ఉండమట్ల రామకృష్ణ కు బర్త్ సర్టిఫికెట్ కావాలని గవరయ్య గ్రామ పంచాయతీకి వెళ్లాడు. అక్కడ ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి గవరయ్యకు మాయ మాటలు చెప్పి సర్టిఫికెట్ కావాలంటే దేవీ నాగేశ్వరావుని సంప్రదించాలని సలహా ఇచ్చాడు. గవరయ్య దేవీ నాగేశ్వరావుని - మిగతా వార్త 2లో



## పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై కొత్తపేటలో వైసిపి నిరసన

- ప్రజలపై పెరుగుతున్న భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైసిపి నేతలు

- మిగతా వార్త 2లో

మనసులోమాట




# నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారు

### పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

**అనపర్తి (మనసులో మాట),మే 18:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని, ఇది చాలదన్నట్టు ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంచి అదనపు భారాన్ని మోపడం పై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా ఆటో తాళ్లతో లాగుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. పెట్రోల్,డీజిల్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో సోమవారం, వైయస్ఆర్సీపీ అనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి నాయకత్వంలో, శాంతియుత మహా ధర్నా, భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ ధరల పెంపు కారణంగా అన్ని వర్గాల ప్రజలపై భారం పడుతుందని అన్నారు. ఈ కారణంగా సామాన్యుల పక్షాన చేపట్టిన నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారని తెలిపారు . ముందుగా అనపర్తి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్న పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు కలిసి బయలుదేరి మెయిన్ రోడ్డు మీదుగా దేవి చౌక్ సెంటర్ నుండి పాత ఊర్లోని తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నామని తెలిపారు. సూర్యనారాయణ రెడ్డి పావర్టీ శ్రేణులతో కలిసి స్థానింక తహసీల్దార్ కు కూటమి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తక్షణం తగ్గించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

### కూటమి ప్రభుత్వంలో

# సంక్షేమ విప్లవం

- మొదటి పేజీ తరువాయి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) కొనియాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త వితంతు పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎన్టీఆర్ భరోసా పథకం' కింద అర్హులైన ప్రతి వితంతువుకు నెల వారీ పింఛన్ మొత్తాన్ని రూ. 4 వేలకి పెంచి కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1.53 లక్షల మంది నూతన లబ్ధిదారులకు ఈ నిర్ణయం ద్వారా నేరుగా ప్రయోజనం చేకూరనుందన్నారు. నగర పరిధిలో అర్హులైన వితంతువులు పింఛన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించనుందన్నారు. దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాల వివరాలను ప్రభుత్వం త్వరలోనే అధికారికంగా విడుదల చేస్తుందని, నగరంలో అర్హులెవరూ నష్టపోకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకునేలా స్థానిక సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు సహకరిస్తారన్నారు. రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజా రంజక పాలన అందిస్తోందని, నగర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

### - రాత్రంతా రోడ్డుపైనే మృతదేహం పక్కన బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన జక్కంపూడి రాజా

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** కోరుకొండలో ఆదివారం రాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ ఢీకొని నరసాపురం గ్రామానికి చెందిన నొక్కి రాజు వర్మ (27) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. అదే గ్రామానికి చెందిన సోలపు విక్కీ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాత్రంతా రోడ్డుపైనే మృతదేహం పక్కనే బైఠాయించి ధర్నా చేశారు. రోడ్డుపైనే పడుకుని రాత్రంతా నిద్రహారాలు మని తన నిరసనను కొనసాగించారు.



మరో వైపు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నరసాపురానికి చెందిన దళితులు కోరుకొండ బస్టాండు సెంటర్లో రాస్తా రోకోకి దిగారు. ట్రాఫిక్ భారీగా స్తంభించింది. మృతదేహం పక్కనే కూర్చుని జక్కంపూడి రాజా తన నిరసనను వ్యక్తం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరో వైపు పోలీసు బలగాలు కోరుకొండలో భారీగా మోహరించాయి. ఇదిలా ఉండగా.. పోలీసు బలగాలతో మమ్మల్ని భయపెట్టలేరని జక్కంపూడి రాజా అన్నారు. అక్రమ తవ్వకాలు ఆపి, బాధితులకు న్యాయం జరిగే వరకూ మృతదేహాన్ని కదిలించే ప్రసక్తి లేదని పోలీసు అధికారులతో రాజా సుస్పష్టంగా చెప్పారు. జక్కంపూడి రాజా పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెందిన వేణుగోపాల కృష్ణ, మాజీ హోం మంత్రి తానేటి వనిత, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సంఘీభావం తెలిపారు. రాజాతో న్యాయపోరాటానికి తాము సిద్ధమేనని ఈ సందర్భంగా ప్రకటించారు.

# నకిలీ సర్టిఫికెట్లతో నయా దందా

- మొదటి పేజీ తరువాయి కలసి వివరాలు ఇచ్చి వెళ్ళాడు. 15 రోజుల తర్వాత సర్టిఫికెట్ కు నాలుగు వేలు అవుతుందని ఉద్యోగి శ్రీనివాస్ రూ.3 వేలు ఒకసారి, వెయ్యి రూపాయలు ఒకసారి రెండు దపాలుగా మొత్తం రూ.4 వేలు తీసుకుని దేవీ నాగేశ్వరావు సమక్షంలో చేతి రాతతో రాసిన సర్టిఫికెట్ అందజేశాడు. గవరయ్య ఇటీవల ఆ సర్టిఫికెట్ ను వేరొకరికి చూపించగా అది నకిలీ సర్టిఫికెట్ అని తేల్చి చెప్పారు. ప్రస్తుతం అన్నీ ఆన్ లైన్ ద్వారా మాత్రమే డిజిటల్ సంతకాలతో సర్టిఫికెట్లు మంజూరు అవుతున్నాయని, చేతి రాత సర్టిఫికెట్ చెల్లుబాటు కాదని చెప్పడంతో గవరయ్య మోసపోయినట్లు గ్రహించి గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశాడు. వారి సలహా మేరకు పోలీసులను ఆశ్రయించాడు. ఈ విధంగానే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తోకల శ్రీనివాస్ అమాయకులకు ఎరవేసి దేవీ నాగేశ్వరావు ద్వారా లావాదేవీలు చేస్తూ ఇద్దరూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. గవరయ్య లానే చాలా మందిని మోసగిస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకుని ఫేక్ దందా అరికట్టాలని కోరుతున్నారు. ఇద్దరి ఘరానా మోసగాళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కడియం పోలీసులను ఆదేశించారు. ఈ ఫిర్యాదులో పేర్కొన్న నిందితుల్లో ఒకరైన దేవీ నాగేశ్వరరావు గత ఏడాది దుళ్ళ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు స్థలంగా చెప్పి విక్రయించి సొమ్ములు చేసుకున్నాడని చెబుతున్నారు. ఈ విషయంపై బాధితులు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి దేవీ నాగేశ్వరరావు పై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. గ్రామ పెద్దల మధ్య ఆ తగువు నడుస్తుండగానే తాజాగా మరో అభియోగాన్ని ఎదుర్కొంటున్నాడు. గత ఐదేళు ్లగా గ్రామ పంచాయతీ పేరు చెప్పి నిందితులు అనేక అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. వంద రూపాయలు నుండి వేలు, లక్షల రూపాయల్లో ముడుపులు పుచ్చుకుని గ్రామ పంచాయతీ స్టాంపులు దుర్వినియోగం చేస్తూ అనేక సర్టిఫికెట్లు జారీ చేసినట్లు పలువురు ఆధారాలు చూపుతున్నారు. నకిలీ దందాల ద్వారా గ్రామ పంచాయితీని అడ్డుపెట్టుకుని ప్రతి ఏటా కోటి రూపాయల దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. లోతుగా విచారిస్తే అన్ని ఆధారాలు వెళ్ళడవుతాయని చెబుతున్నారు. కాగా ఫేక్ సర్టిఫికెట్లు జారీ చేసి దందాలకు పాల్పడిన ఉదంతంపై పోలీసులు విచారణ చేపట్టినట్టు విశ్వసనీయ సమాచారం.

# పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై కొత్తపేటలో వైసిపి నిరసన

### - ప్రజలపై పెరుగుతున్న భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైసిపి నేతలు

**కొత్తపేట( మనసులో మాట) మే 18..** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేట లో పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్,డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోతూ సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుండి కొత్తపేట ఆర్డీవో కార్యాలయం వరకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి , రిక్షాపై మోటార్ సైకిల్‌ను ఎక్కించి స్వయంగా రిక్షా తొక్కుతూ వినూత్న ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎండ వేడిని లెక్కచేయకుండా పెద్ద ఎత్తున పాల్గొని




ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరుతూ ఆర్డీవో కి వినతిపత్రం అందజేశారు. ప్రజల సమస్యలపై వైసిపి ఎప్పటికీ పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యకర్తలు నాయకులు లతొ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి ముత్యాల వీరభద్రరావు, గొల్లపల్లి డేవిడ్ రాజు, చిలువూరి రామకృష్ణంరాజు, చల్లా ప్రభాకర్, కప్పల శ్రీధర్, సాకా ప్రసన్నకుమార్, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వేగవంతంగా వినతుల పరిష్కారం

**- కమిషనర్ రాహుల్ మీనా**

**- పీజీఆర్ఎస్ ద్వారా 28 అర్జీలు స్వీకరణ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** ప్రజల నుంచి పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 28 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 12, రెవెన్యూకి సంబంధించి 3, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 9, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 3, వార్డు సచివాలయాలకు సంబంధించి ఒకటి ఉన్నాయి. వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు చేరువ చేసి వారిలో సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో గృహగణన వేగవంతంగా జరుగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ దాదాపు 80 శాతానికి పైగా పూర్తి చేశారని.. అలాగే సెన్సస్ సర్వేలో ఏ ఒక్క వీధిని, గృహాన్ని వదలకుండా పూర్తి పారదర్శకతతో త్వరితగతిన సర్వేను పూర్తి చేయవలసిందిగా సూచనలను ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 20న మందుల షాపుల బంద్

**ఆన్‌లైన్ మందుల అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్**



**పిఠాపురం, (మనసులో మాట) మే 18:** కెమిస్టుల సమాఖ్య ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న బంద్ లో భాగంగా పిఠాపురం పట్టణం మరియు మండలంలోని అన్ని మందుల షాపులను ఈనెల 20వ తేదీన మూసివేయనున్నట్లు పిఠాపురం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీబీఎస్ ప్రభాకరరెడ్డి, కె సుధాకర్, రెడ్డెం జనార్ధన్ సోమవారం పిఠాపురం తహశీల్దార్ పీవీ గోపాలకృష్ణ, సీఐ జి శ్రీనివాస్‌లను కలిసి ఈ బంద్ గురించి అధికారికంగా సమాచారం అందించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కూడా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా మందుల అమ్మకాలను తక్షణమే నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లకు అడ్డుకట్ట వేయాలని, నకిలీ మందుల అమ్మకాలను కఠినంగా నివారించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతను, స్థానిక వ్యాపారుల జీవనోపాధిని కాపాడటం కోసమే ఈ బంద్ నిర్వహిస్తున్నామని, దీనికి అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారస్తులు పూర్తి సహకారం అందజేయాలని కోరారు

# స్వచ్ఛందంగా తన కాన్వాయ్ వాహనాల సంఖ్యను తగ్గించిన ఎమ్మెల్యే

**- ప్రజల కోసం తన కారును పక్కనపెట్టి సాధారణ టూ వీలర్‌పై చింతలపూడి ఎమ్మెల్యే పర్యటన**

**- సంస్కరణల అమలులో ఆదర్శంగా నిలుస్తున్న ఎమ్మెల్యే సొంగా.రోషన్ కుమార్**



**చింతలపూడి( మనసులో మాట) మే 18:** పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా .చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే సీఎం తన కాన్వాయ్ వాహనాల సంఖ్యను తగ్గించుకోగా, అదే బాటలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కూడా ముందడుగు వేశారు. ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో, తన క్యాంపు కార్యాలయం నుండి చింతలపూడి మినీ బస్టాండ్ వరకు సాధారణ బైక్‌పై ప్రయాణించిన ఎమ్మెల్యే అక్కడున్న ప్రజలను ఆకట్టుకున్నారు. "నాయకుడు అంటే చెప్పడం కాదు... చేసి చూపించాలి" అనే భావనతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ , అత్యవసర పరిస్థితుల్లో ఇంధన పొదుపు ఎంత ముఖ్యమో తన చర్యల ద్వారా చాటిచెప్పారు. కాన్వాయ్ వాహనాలను తగ్గించుకోవడం ద్వారా ఆయన చూపించిన బాధ్యతాయుతమైన నిర్ణయం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. ప్రజా సమస్యల పరిష్కారంలోనే కాకుండా, దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో కూడా ముందుండి ఆదర్శంగా నిలుస్తున్న ఎమ్మెల్యే నిర్ణయం నియోజకవర్గ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా మారింది. ఎమ్మెల్యే ఈ వినూత్న చర్యను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ అవసరమైనప్పుడు మాత్రమే వాహనాలను వినియోగిస్తూ ఇంధనాన్ని ఆదా చేయాలని, దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా సహకరించాలని కూటమి నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

# వ్యాట్ పేరుతో జనాలను బాదడంలో ఏపీ రోల్ మోడల్

**-పెట్రోల్ ధరల పెంపుపై ధ్వజమెత్తిన ఏపీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** వ్యాట్ పేరుతో జనాలపై ధరల బాదుడు చేయటంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్ గా ఉందని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక ఇంధనం ధరలు ఏపీలో ఉండటమే అడ్వాన్స్‌డ్ ఆంధ్రప్రదేశ్ అని విమర్శించారు. సెస్ ల పేరుతో జనాల పర్సులు ఖాళీ చేయడం విజన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యమా అని ప్రశ్నించారు.

దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 97.77లు ఉంటే ఢిల్లీని తలదన్నే అమరావతిలో లీటర్ పెట్రోల్ ధర 113. 62 పైసలు ఉండటం ప్రజల పట్ల వీరికున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. పక్కరాష్ట్రం తమిళనాడుతో పోల్చినా రూ. 10లు అదనమని, కర్ణాటకతో రూ . 7లు, తెలంగాణ, కేరళతో చూసినా రూ. 4లు ధరాభారం ఏపీలో ఉందని అన్నారు. అభివృద్ధిలో చివరి స్థానం, ఇంధనం ధరల్లో మొదటి స్థానం ఉన్నందుకు సిగ్గుపడాలని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ పై వసూలు చేస్తున్న 31 శాతం అధిక వ్యాట్ ను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబుని డిమాండు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఇంధనంపై వ్యాట్ ను భారీగా తగ్గిస్తూ, అదనంగా వసూలు చేస్తున్న 4 రూపాయలను, రోడ్డు సెస్ పేరుతో దోపిడీ చేస్తున్న రూ. 1 లని, మొత్తంగా లీటర్ ధరపై కనీసం 5 రూపాయలు అయినా ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నామన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తవ్వితే కఠిన చర్యలు - కలెక్టర్



**అమలాపురం(మనసులోమాట) మే 18:** అనుమతి లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపినా, అక్రమ రవాణాకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జుల్లా ఇసుక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేం దుకు ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లం ఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోనసీమ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా పంపిణీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు లోబడి, అత్యంత పారదర్శ కంగా జరగాలని ఇసుక అక్రమ తవ్వకాలు రవాణా కు పాల్పడే వారిపై కఠిన చర్యలు గైకొనాలని స్పష్టం చేశారు జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శ కంగా నిర్వహించాల న్నా రు. ప్రస్తుతం జిల్లాలో 5 రీచ్ లలో ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయని వీటిలో నాలుగు రీచ్లు సెమీ మెకానేజ్డ్ కాగా తాతపూడి రీచ్ మాన్యువల్ గా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నా రన్నారు. జిల్లాలో ఐదు రీచ్లు రెన్యువల్ చేయాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రుతుపవనాలు సీజన్లో వర్షాకాలంలో డిమాండ్ కు అనుగుణంగా ఏడు లక్షల మెట్రిక్ టన్ను లు స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచాలని ఆదేశించినప్ప టికీ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 10 లక్షల మెట్రిక్ టన్నుల ను స్టాక్ పాయింట్లలో నిల్వలు ఉంచనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్టాక్ పాయింట్లలో 6.65 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని చెప్పారు. కపిలే శ్వరపురం కేదార్లంక లో పట్టా భూములలో (డి-కాస్టింగ్) భూములలో ఇసుక త్రవ్వకాలు జరుగు తున్నాయన్నారు. రావుల పాలెం, ఆలమూరు, పి గన్నవరం, అల్లవరం మండలాలలో అక్రమ ఇసుక మట్టి త్రవ్వకాలు జరుగుతున్నట్లు దినపత్రిక లలో కథనాలు వస్తున్నాయని ఈనేపథ్యంలో గనులు రెవెన్యూ పోలీస్, రవాణా శాఖల అధికారు లను మండల వారి బృం దాలుగా విభజించి వారంలో రెండు రోజులు యాదృచ్ఛికంగా సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల బృందాలు రావులపాలెం లో అక్రమ ఇసుక తవ్వకాలు అక్రమ రవాణా కు సంబం ధించి 4 కేసులు బనాయిం చినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం గనుల శాఖ మట్టి త్రవ్వకాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఓవర్ లోడు ఇసుకతో వెళుతున్న వాహనాలపై రవాణా శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కేసులు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఇసుక లోడుతో వాహనాలు వేగం గా వెళుతున్నాయని వేగాన్ని నియంత్రిం చాలని ఆయన ఆదేశించారు. ఇసుకలోడ్లతో అతివేగంగా వెళ్ళే వాహ నాలను సీజ్ చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉచిత ఇసుక పాలసీలో సొంత నిర్మాణ రంగ అవసరాలకు ట్రాక్టర్లు ఎడ్ల బండ్లపై ఇసుకను ఉచి తంగా తరలించు కోవచ్చు నని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ త్రవ్వ కాలకు సంబంధించి రూ 1,88,000 మేర జరి మానా విధించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా అక్రమ రవాణా సంబం ధించి 42,190 క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించి రూ. 13,43,000 జరి మానా విధించడం జరిగిందని అలాగే 79 వాహ నాలు కు పెనాల్టీ విధించినట్లు తెలిపారు. అక్రమ రవాణాకు సంబంధించి నాలుగు నెలలుగా రూ 66 లక్షలు జరిమానా విధించడంజరిగిందన్నారు. జేసి వైఖోమ్ నిధియాదేవి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక లభ్యతను నిరంతరం పర్య వేక్షిస్తూ, సామాన్య ప్రజల కు, నిర్మాణ రంగానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలోఆర్డీవోలు జి మమ్మీ డి సరళావతి,గనులు భూగర్భ శాఖ ఏడి డి అశోక్ కుమార్ డిపిఓ శాంతి లక్ష్మీ, జలవనరుల శాఖ హెడ్ వర్క్స్ ఈఈ జి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ సి బి రాము,పోలీస్ రవా ణా శాఖల ఉన్నతాధికారు లు పాల్గొన్నారు.



## జంట పట్టణాల్లో వార్డుల పెంపు

# ముసాయిదా జారీ!

**పెద్దాపురం (మనసులో మా) మే 18;** కాకినాడ జిల్లాలో జంట పట్టణాలుగా ప్రసిద్ధి చెందిన పెద్దాపురం, సామర్లకోట పట్టణంలో మున్సిపల్ వార్డుల పెంపుకు ముసాయిదానం మున్సిపల్ కమిషనర్లు జారీ చేశారు. రాష్ట్ర కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాయపూడి,ఆంధ్ర ప్రదేశ్ ఆదేశాల మేరకు మున్సిపల్ వార్డులను పెంపుదల చేస్తూ ముసాయి జారీ చేసినట్లు రెండు పట్టణాల కమిషనర్లు తెలిపారు. పెద్దాపురం పట్టణంలో ఇప్పటివరకు 29 మున్సిపల్ వార్డులు కొనసాగుతుండగా నూతనంగా 32 వార్డులకు పెంపుదల చేస్తూ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ముసాయిదా జారీ చేశారు. సామర్లకోటలో ఇప్పటివరకు 31 వార్డులు ఉండగా నూతనంగా ఆ సంఖ్యను 36 కు పెంచినట్లు కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. ముసాయిదాల వివరాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు కమిషనర్లు వివరించారు. వార్డుల పెంపుదలకు సంబంధించి ప్రజలు సూచనలు సలహాలు వెంటనే అందించాలని పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కోరారు.

# మీ అవినీతిపై ప్రశ్నిస్తే మాపై దాడులా

**- ఎమ్మెల్యే నెహ్రూ పై పాటంశెట్టి సూర్యచంద్ర ధ్వజం**



**జగ్గంపేట (మనసులో మాట) మే 18..** మంత్రి నారా లోకేష్ జగ్గంపేట పర్యటన సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గంలో జరుగుచున్న మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై మరియు నియోజకవర్గ ప్రజా సమస్యల మీద స్పందించుట కోసం బూరుగుపూడి గ్రామంలో మా ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశం జరగకుండా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను మా ఇంటి పైకి పంపించి నామీద, నా శ్రేయోభిలాషుల మీద భౌతిక దాడులు చేసి దౌర్జన్యానికి పాల్పడడం ప్రశ్నించే గొంతుని అణచి వేయడం మీకు న్యాయమా అని జ్యోతుల నెహ్రూని సూర్యచంద్ర ప్రశ్నించారు. మా ఇంటి మీదకి వచ్చి మా మీదకు దాడికి తెగబడి మాపై దౌర్జన్యం చేయడమే కాకుండా, తెలుగుదేశం పార్టీ నాయకులు వారి చొక్కాలు వారే చింపుకొని మాపై తప్పుడు కేసులు బనాయించడానికి ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను కూలదోయడమేనని సూర్యచంద్ర ఆరోపించారు. ఎమ్మెల్యే అవినీతి చేయకపోతే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల మట్టి గ్రావెల్ ఇసుక అక్రమ తోలకాలు ఎవరు చేస్తున్నారో నిరూపించాలి కదా అని అన్నారు. రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న మీరు అదే రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించే హక్కు మీకు ఎక్కడిదిని సూర్యచంద్ర ప్రశ్నించారు. పోలీసు వారు సమగ్ర విచారణ చేసి మా ఇంటికి వచ్చి మా పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూర్యచంద్ర కోరారు.

# ఆటోకి తాడు కట్టి..రోడ్డుపై బైఠాయించి..

**- పెంచిన పెట్రో ధరలకు నిరసనగా కదం తొక్కిన వైసీపీ శ్రేణులు**

**- సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ వెంటనే గద్దె దిగాలి..**

**- వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ వద్ద నిరసన స్వరాలు**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. ఆటోకు రెండు వైపులా తాళ్ళను కట్టి వైసీపీ నేతలు, కార్యకర్తలు లాగుతూ 'కూటమి' ప్రభుత్వ అసమర్థతను నాయకులు దెప్పిపొడిచారు. కూటమి ప్రభుత్వ పాలనలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే అత్యధికంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్నాయని, ఇది ప్రభుత్వ పాలకుల అసమర్థతకు నిదర్శనంగా ఉందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండు చేస్తూ వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్, రాజమండ్రి ఆటో వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర రావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద ఈ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఆటోలకు తాళ్లు కట్టి లాగుతూ గోదావరి రైల్వే స్టేషన్ నుంచి సబ్ కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకుని అక్కడ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఇచ్చిన హామీని విస్మరించిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే గద్దె దిగాలని డిమాండు చేశారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు దారుణంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. పక్కనున్న తమిళనాడు కంటే 5 నుంచి 6 రూపాయలు ధరలు ఎక్కువగా ఉంటే సీఎం చంద్రబాబు ధరలు తగ్గించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు పార్టీ ఇచ్చిన మద్దతుతోనే కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేసి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకలేకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మాత్రం హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వెళ్లడానికి ప్రత్యేక విమానాలు వాడుతూ ప్రజలు ఇంధన పొదుపు చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు పాలన అంటేనే మాయ, అబద్ధాలు అని.. ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా ప్రజలని మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. పెంచిన ధరలు తగ్గించే వరకు వైసీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలన ఎప్పుడు వచ్చినా బాదుడే బాదుడులా ఉంటుందని విమర్శించారు. ఈ ధరలు తగ్గించకపోతే సామాన్యుడి జీవితం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధంగా ప్రజలపై ధరల భారం పెంచడం సరికాదన్నారు. వాసంశెట్టి గంగాధర రావు మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా రవాణా రంగం పూర్తి కుదేలవుతుందని, నిత్యావసరాల ధరలు దారుణంగా పెరిగిపోతాయన్నారు. సామాన్యులు ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనలో ఇబ్బందులు పడుతుంటే మళ్లీ వారిపై పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని వేయడం సమంజసం కాదన్నారు. ఇంధనం పొదుపు చేయాలని నీతులు చెబుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లోకేష్ ముందు వారు పాటించాలని డిమాండు చేశారు. ధరలు పెరగకుండా చేస్తామని అధికారంలోకి వచ్చి పాలనలో విఫలమైన కూటమి ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుర్రం గౌతమ్, జిల్లా మహిళాధ్యక్షురాలు మార్తి లక్ష్మి, వివిధ విభాగాల నాయకులు మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, సప్పా ఆదినారాయణ, బిల్డర్ చిన్న, కాటం రజనీకాంత్, రొక్కం త్రినాధ్, మార్తి నాగేశ్వరరావు, హసీనా, షేక్ నిజామ్, బూడిద శరత్‌కుమార్, అమీర్ పాషా, సుందర్ సింగ్, నల్లా రామాంజనేయులు, రేగుళ్ల నాని, అనంతలక్ష్మి, కృష్ణవేణి, అనురాధ, మార్గాని రాము, ఆరే చిన్ని, ఎస్కే షరీఫ్, ఆరిఫుల్లా ఖాన్, కాటం సంజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

# నూజివీడులో జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య

**- రాంగ్ రూటు లో వస్తున్న వాహనాలు - స్వాతంత్రానికి పూర్వపు రోడ్లు**

**-నేటికీ ఊసే లేని రోడ్ల విస్తరణ - రింగు రోడ్డు నిర్మాణం ఎప్పుడు సాగేను...?! - పట్టణ ప్రజల ఆవేదన**



**నూజివీడు (మనసులో మాట) మే 18:** నూజివీడు పట్టణ పరిధిలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోతోందని వాహన చోటకులు వాపోతున్నారు. వారం ప్రారంభంలో ఉన్న సోమవారం స్థానిక మున్సిపల్ శాఖకు చెందిన భారీ వాహనాలు వన్ వే లో ఎదురుగా రాంగ్ రూటులో రావడం వలన ట్రాఫిక్ మరింత సమస్యగా మారిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది సామాన్యులకు ఆదర్శంగా ఉండాల్సిన తరుణంలో... నియమ నిబంధనలను తుంగలో తొక్కి... అడ్డదిడ్డంగా వాహనాలను రాంగ్ రూటులో నడపడం ఏమిటని పలువురు సామాజికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. అసలే ఇరుకైన రోడ్లు... ఎప్పుడో స్వాతంత్రానికి ముందు ఉన్న రోడ్లు మినహా... ఒక అంగుళం కూడా రోడ్ల విస్తరణ జరగలేదని నూజివీడు పట్టణ ప్రాంత ప్రజానీకం లబోదిబోమంటున్నారు. ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటికీ... ఎంతమంది ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించినా... నూజివీడు పట్టణంలో రహదారుల రూపురేఖలు... ట్రాఫిక్ సమస్య లకు ఏమాత్రం పరిష్కారం లభించలేదన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇప్పటికైనా నూజివీడు పట్టణం వైపు కన్నెత్తి చూసి... వీలైతే రోడ్ల విస్తరణ... కాకుంటే 4 వైపులా రింగురోడ్డు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రాంత ప్రజానీకం ముక్తకంఠంతో వేడుకుంటుంది. సమీపములోని మీర్జాపురం, లీలా నగర్... రమణక్కపేట అడ్డ రోడ్డు వంటి ప్రాంతాలు ముందు చూపుతో రోడ్ల విస్తరణ... గృహ మరియు దుకాణ సముదాయాలు ఏర్పాటు జరిగాయి అన్నారు. రెవిన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణం మాత్రం రోజురోజుకు రహదారుల విషయంలో కుంచించుకుపోతోందని వాపోయారు. దుకాణాలు, గృహ నిర్మాణాలు డ్రైనేజీలను సైతం ఆక్రమిస్తూ కొనసాగుతుంటే మున్సిపల్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు చూస్తూ నిమ్మకుని రెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలు ప్రజాసంఘాల నాయకులు దుయ్యబట్టారు. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్ల విస్తరణ, రింగు రోడ్డు నిర్మాణం కొనసాగాలని డిమాండ్ చేస్తున్నారు.



## ముత్యాల బాబ్జి కుటుంబాన్ని పరామర్శించిన నామన రాంబాబు

**కొత్తపేట (మనసులో మాట )మే 18..** కొత్తపేట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి మాతృమూర్తి సత్యవతి (శతాబ్ది వృద్ధురాలు ) మృతి పట్ల వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, సత్యవతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి కుటుంబానికి ధైర్యం చెప్పారు, ఆయన వెంట కుంపట్ల బాబ్జి, ముద్రగడ ఫణి నామన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ గా కాట్రగడ్డ రవీంద్ర

### - బీజేపీని మరింత బలోపేతం చేయడానికి పనిచేస్తా



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** తూర్పు గోదావరి జిల్లా కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ గా కాట్రగడ్డ రవీంద్ర, కో కన్వీనర్ గా బొమ్ముల సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నియమాక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, తదితర బీజేపీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. “పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, సామాన్య ప్రజల సేవలో, పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని“ తెలియజేశారు. పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతీ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములుగా చేసి వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా కృషిచేస్తానని రవీంద్ర తెలిపారు.

## గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు



**కొత్తపేట (మనసులో మాట )మే 18..** ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరాలలో భాగంగా విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు కల్లేపల్లి రత్నంరాజు తెలుగు సంస్కృతి సంప్రదాయాలు, వివిధ పండుగలు, మన ఆలయాలు గురించి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి ఓం నమశివాయ విద్యార్థులు అందరి చేత పుస్తక పఠనం చేయించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో విజ్ఞాన పెంపొందించేందుకు వేసవిజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాబోయే వర్షాకాలం దృష్ట్యా మేజర్ డ్రైనేజీలు పై ప్రత్యేక చర్యలు

### - కమిషనర్ ఎన్. వి. వి.సత్యనారాయణ



**కాకినాడ (మనసులో మాట) మే 18..** కాకినాడ నగరాన్ని ముంపు రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధాన డ్రైనేజీలో సిల్క్ తొలగింపు కార్యక్రమాన్ని నగరపాల సంస్థ చేపట్టిందని కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ చెప్పారు. స్థానిక రామారావు పేట 39వ డివిజన్లో విస్తృతంగా పర్యటించి శానిటేషన్ పరిస్థితులను పరిశీలించగా అక్కడ సమస్యలను తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు, 39 వ వార్డ్ ఇంచార్జ్ మల్లిపూడి వీరు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు . ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన త్రాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదని వీధి దీపాలు వెలగడం లేదని తమ దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ మౌలిక వసతులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అందులో భాగంగా 39 వ డివిజన్ చీడిలపారు లో ప్రధాన డ్రైనేజీ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలలో పేరుకు పోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని యుద్ధ పాతిపదికన నిర్వహిస్తున్నామని తెలిపారు . దీనికి ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని కమిషనర్ అన్నారు. కొంతమంది పరుపులు, మంచాలు, పాత వస్తువులను ప్రధాన డ్రైనేజీల్లో వేయడంతో చెత్త పేరుకు పోవడంతో చిన్నపాటి వర్షానికి నగరంలో కొన్ని ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని అందుచేత మేజర్ డ్రైన్లు నందు పేరుకు పోయిన సిల్టును తరలింపు పనులు చేపట్టడం జరుగుతుందని చెప్పారు . మరి కొంతమంది కాలవలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల సిల్క్ తొలగింపు పనులు ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు,వార్డ్ ఇంచార్జ్ మల్లిపూడి వీరు మాట్లాడుతూ తమ వార్డులో ప్రధానంగా చీడిలపారులో ప్రధాన డ్రైనేజీ సిల్క్ తొలగింపు కాలవ పై మొక్కలు పెరిగి పోవడంతో డ్రైనేజీ శిధిలవస్థకు చేరిందని కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని కమిషనర్ సానుకూలంగా స్పందించి సకాలంలో పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ పృధ్వి చరణ్, సానిటరీ ఇన్స్పెక్టర్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు

# ఎడ్ల బండితో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వినూత్న నిరసన




**పెద్దాపురం మనసులో మాట మే 18;** పెట్రో ధరల పెంపుకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ఎడ్ల బండితో పెద్దాపురంలో ర్యాలీ నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు పెద్దాపురం పార్టీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో నేతలు కార్యకర్తలు సామర్లకోట పార్టీ కార్యాలయం నుండి పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెంపుకు నిరసన వ్యక్తం చేస్తూ తాళ్లతో ఆటోను లాగారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా సామాన్య ప్రజల పరిస్థితి అత్యంత దురదంగా మారిందని దొరబాబు వాపోయారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని దొరబాబు ఆరోపించారు. పెంచిన పెట్రోల్ ధరలను తక్షణమే తగ్గించాలని కోరుతూ పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు. పెట్రోల్ ధరల తగ్గింపు,ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రజా పోరాటంలో తగ్గేదే లేదంటూ దొరబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు నెక్కంటి సాయిప్రసాద్, ఆవాల లక్ష్మీనారాయణ, తలారి దొరబాబు ఇరుసుమల్ల సాయి సత్యనారాయణ, జాన్ మోజేష్, షేపెని సురేష్, మోరంపూడి శ్రీరంగనాయకులు, సామర్లకోట ఎంపీపీ సత్తిబాబు, చిట్టి మాని శ్రీనివాస్, విర దాసరి నాగేంద్ర, షేపెని రూపా దేవి, స్థానిక నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని వైయస్సార్ పార్టీ డిమాండ్

### - మోసపూరిత వాగ్దానాలు చేశారు

### - చింతలపూడి వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ కంభం విజయరాజు



**చింతలపూడి( మనసులో మాట) మే 18:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ చింతలపూడి నియోజకవర్గ వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ కంభం. విజయరాజు ఆధ్వర్యంలో చింతలపూడి పట్టణం లో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ స్టేషన్ సెంటర్లోని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి, అనంతరం పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని మానవహారం నిర్వహించారు.చింతలపూడి పట్టణం బోయగూడెం లోని వైఎస్ఆర్ పార్టీ ఆఫీసు నుండి ర్యాలీగా ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లారు. స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వద్ద పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైయస్సార్ పార్టీ నాయకులు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని స్థానిక ఎమ్మార్వో కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైయస్సార్ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం. విజయ రాజు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచమని ప్రకటించి, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మాట తప్పి, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో మోసపు వాగ్దానాలు చేశారని, ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ రాష్ట్ర నాయకులు జెట్టి. గురునాధరావు , చింతలపూడి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లు జగ్గవరపు జానకి రెడ్డి, బొడ్డు. వెంకటేశ్వరరావు, ఎంపీపీ డాక్టర్ రాంబాబు, జడ్పిటిసి నీరజ, చింతలపూడి లింగపాలెం మండల వైయస్సార్ పార్టీ ప్రెసిడెంట్ లు రమేష్ రెడ్డి, శాంతారావు, లింగపాలెం వైస్ ఎంపీపీ మట్ట. సురేష్, చింతలపూడి పట్టణ వైయస్సార్ పార్టీ ప్రెసిడెంట్ కొప్పుల. నాగేశ్వరరావు, వైయస్సార్ పార్టీ నాయకులు ఆతుకూరి. సుబ్బారావు, మల్లేశ్వరం మాజీ సర్పంచ్ ఎడ్ల.మోహన్ రావు, నిమ్మగడ్డ.దుర్గారావు, మిరియాల.దిలీప్ పాల్గొన్నారు.



## పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలి

**తాడేపల్లిగూడెం (మనసులో మాట), మే 18 :** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని వైసీపీ నాయకులు గుండుబోగుల నాగు, రెడ్డి సూరిబాబు, కైకాల శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం తాడేపల్లిగూడెం వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘురాం నివాసం నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను తోస్తూ తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల పూర్తి కాగానే పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం దారుణం అన్నారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ అనురాధకు వినతి పత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు చిత్తూరు బాపన్న, నాయకులు దారపురెడ్డి శ్రీనివాస్, కండెల్లి రాజేష్, వట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐ లో ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానం



**నూజివీడు (మనసులో మాట) మే 18:**నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రధాన అధికారి పీ రజిత తెలిపారు. రజిత సోమవారం మాట్లాడుతూ ఈనెల 19 నుండి జూన్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు http://www.iti.ap.gov.in ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో జూలై 2వ తేదీ లోగా కళాశాలలో వెరిఫికేషన్ కు రావాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాల పని వేళల్లో సంప్రదించవచ్చునన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో జూలై 8వ తేదీ నుండి 15వ తేదీ లోపు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం కౌన్సిలింగ్ కు హాజరు కావాలన్నారు. ఈ సదవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నూజివీడు పట్టణంలో రోడ్డు ప్రమాదం

**- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు**



**నూజివీడు (మనసులో మాట) మే 18:** నూజివీడు పట్టణం లోని తిరువూరు రోడ్డులో గల స్మశానం సమీపంలో స్కూటీ, బొలెరో వాహనం ఢీ కొట్టిన సంఘటనలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వాహన చోదకులు 108 అంబులెన్స్ కు సమాచారం అందించగా క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి, మృతదేహాన్ని మార్చురికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలపై వైసీపీశ్రేణుల నిరసన

### తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్ తోటనరసింహం




**జగ్గంపేట (మనసులో మాట) మే 18..** కూటమి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలపై జగ్గంపేట వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి, జగ్గంపేట నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ట్రాక్టర్లు తో వైసీపీ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది.సంపద సృష్టిస్తామని చెప్పి, ప్రజల సంపదను దోచేస్తున్నారని మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు , జగ్గంపేట నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోటనరసింహం మండిపడ్డారు. జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పించారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను విచ్చలవిడిగా పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోట నరసింహం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరలకు నిరసనగా సోమవారం జగ్గంపేట జంక్షన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని,కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “అధికారంలోకి రాకముందు సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు, నేడు ప్రజల సంపదను దోచుకుంటున్నారు. నిత్యావసరాల నుంచి ఇంధన ధరల వరకు ప్రతి వస్తువుపై అడ్డగోలుగా ధరలు పెంచుకుంటూ పోతూ సామాన్యుడి మనుగడను ప్రశ్నార్థకం చేశారు“ అని మండిపడ్డారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు బ్రతుకలేని పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మోసపూరిత హామీలు రెండేళ్లయినా అమలు చేయలేదని వికలాంగుల పెన్షన్లు ఇవ్వలేదని అన్నారు.కూటమి ప్రభుత్వం చెప్తున్నవన్నీ అబద్ధాలేనని, ఇచ్చిన మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచారని తోట నరసింహం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడం అత్యంత బాధాకరమని, ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని దుయ్యబట్టారు. “ప్రజలెవరూ అమాయకులు కారు. మీ మోసపూరిత రాజకీయాలను, వైఫల్యాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెప్పే సమయం వస్తుంది“ అని తోటనరసింహం హెచ్చరించారు. ఎల్లప్పుడూ ప్రజాపక్షానా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని అన్నారు

పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. తక్షణమే పెంచిన ఇంధన ధరలను తగ్గించి, ప్రజలపై మోపిన అదనపు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమం అనంతరం తోట నరసింహం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, జగ్గంపేట మండల రెవెన్యూ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రూపొందించిన వినతిపత్రాన్ని,తహసీల్దార్ కు అందజేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ గ్రామల పార్టీ అధ్యక్షులు,ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు, మరియు వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు రెండవ హాజరు తప్పనిసరి

### అక్రమాలను అరికట్టేందుకే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం - రెండవ ఫోటో ఎప్పుడు వస్తుందని ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలు



**ఎటపాక( మనసులో మాట), మే 18:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఇకపై రెండవ హాజరు తప్పనిసరి అని అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కిలక నిర్ణయం తీసుకుంది. ఉదయం 6 నుండి 7 గంటల వరకు పని ప్రదేశంలోని ఈకేవైసీ ద్వారా మొదటి హాజరు ఉదయాన్నే తప్పనిసరి అని తెలిపారు. అలాగే పని ముగిసిన తరువాత గ్రూప్ ఫొటో ద్వారా ఆన్లైన్లో హాజరు తప్పనిసరి అని లేదంటే కూలీలకు వేతనం లేదని స్పష్టం చేశారు. రెండు హాజరులు ఆన్లైన్లో అప్లోడ్ అయితేనే కూలీలకు వేతనం మంజూరు చేయడం జరుగుతుంది ప్రతి ఒక్కరు తప్పకుండా రెండు ఫోటోలు దిగాలని తెలిపారు. ఈ విధంగా ఈ కేవైసీ ద్వారా హాజరు వలన అక్రమార్కులను అరికట్టవచ్చని అలాగే బినామీ కూలీలను అరికట్ట వచ్చని కేంద్రం ప్రభుత్వం ఇటువంటి కిలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# జరిమానాకు బదులు హెల్మెట్

### - వినూత్నంగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



**పిఠాపురం, (మనసులో మాట ) మే 18:** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిని ఆపి, రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాల గురించి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ వివరించారు. ఈ తనిఖీల్లో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమానా విధించకుండా, వారితో కొత్త హెల్మెట్లు కొనిపించి, వాటిని తలపై ధరింపజేసి పోలీసులు వినూత్నంగా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు.దీనితో పాటు ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మైనర్ డ్రైవింగ్, బైక్ స్టంట్స్ అతివేగంగా వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల తీవ్రత గురించి ప్రజలకు వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సై డి లోకేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బూరుగుపూడి పాసాలమ్మ జాతరలో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్



కిర్లంపూడి (మనసులో మాట) మే 18.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పాసాలమ్మ జాతర ఉత్సవాలలో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు జాతరకు హాజరైన తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగిందని అన్నారు.అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠంశెట్టి రమేష్, పాఠంశెట్టి తమ్మారావు, మిరియాల శ్రీను, మిరియాల దుర్గబాబు, మాదారపు వీరబాబు,గుంటముక్కల చిన్న,స్థానిక నాయకులు, జనసేన కార్యకర్తలు, గ్రామ యువత మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ జగ్గంపేట పర్యటన రద్దు

## నేడు తాళ్లూరు లో 52 కోట్ల ప్రాజెక్ట్ కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన



జగ్గంపేట (మనసులో మాట) మే 18.. అనివార్య కారణాలతో మంత్రి నారా లోకేష్ పర్యటన రద్దు అయ్యింది. ఆ పర్యటన రద్దైనప్పటికీ, తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు మాత్రం షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయి. 19వ తేదీ మంగళవారం ఉదయం 9:00 గంటలకు 52 కోట్ల రూపాయలతో చేపట్టే తాళ్లూరు లిఫ్ట్ పనులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవం జరగనుంది ఈ ప్రాజెక్ట్ పూర్తయితే తాళ్లూరు పరిసర ప్రాంతాల్లోని 31 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల చిరకాల కోరిక నెరవేరనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులకు, నాయకులకు,ఎమ్మెల్యే నెహ్రూ పిలుపునిచ్చారు

# కృష్ణ మోహన్ కు..'శ్రీ గురు' పురస్కారం



రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18: స్థానిక ఎస్ఎస్బీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వరాహగిరి కృష్ణ మోహన్ 'శ్రీ గురు' పురస్కారానికి ఎంపికయ్యారు. అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆంధ్ర ప్రదేశ్ విభాగం ఈ నెల 20న జమ్మలమడుగు శ్రీ రంగనాథ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో కృష్ణ మోహన్ కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. వినూత్న విద్యా బోధన, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన పాత్ర తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కృష్ణ మోహన్ కు 'శ్రీ గురు' పురస్కారానికి ఎంపిక చేశామని నిర్వాహకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుమల తిరుపతి దేవస్థాన సిద్ధాంతి దైవజ్ఞ బ్రహ్మశ్రీ తంగిరాల కృష్ణ ప్రసాద్ శర్మ పాల్గొంటున్నారని ప్రసాద్ తెలిపారు.

# బాబూ..బాబ్బాబూ గద్దె దిగు

**- రాష్ట్రంలో బాబు మార్క్ మోసపు పాలన - పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలి**

**- దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే పెట్రోల్ ధరలు అధికం - రాష్ట్రంపై పెట్రో భారం రూ.3,391 కోట్లు**

**-తూర్పు గోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ నిరసన**



రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18.. "ఎన్నికలకు ముందు పెట్రోలు బంకు ముందు ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్ ధరలు అధికం అంటూ సెల్ఫీ ఫోటోలు దిగిన నారా లోకేష్.. ఇప్పుడు ఎక్కడ దాంకున్నారు?..చంద్రబాబు ప్రభుత్వం మరో 'బాదుడే బాదుడు' మొదలుపెట్టిందని మాజీ మంత్రి, తూర్పు గోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోలు ధరలకు నిరసనగా ఆటోలకు తాడు కట్టి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనా కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ తరహాలో కూటమి ప్రభుత్వం మరో మోసంతో పచ్చి దగా చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే పెట్రో ధరలు తగ్గిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, అన్నింటిలాగే ఆ విషయాన్ని కూడా గాలికొదిలేశారన్నారు. బాబు మార్క్ మోసపు పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు లేవని, గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని పథకాలు రద్దు చేయడమే కాకుండా, ఇప్పుడు ఈ తరహా పెట్రో బాదుడే బాదుడుతో వాహనదారులతో పాటు, ప్రజల నడ్డి విరుస్తోందని ధ్వజమెత్తారు. బాబూ గద్దె దిగకపోతే..ప్రజలపై అనేక రకాలుగా భారం మోపడం ఖాయమని అన్నారు.

**రాష్ట్రంలోనే అత్యధిక ధర..**

తాజా పెంపుతో రాష్ట్రంలో లీటరు పెట్రోల్ రూ.113.62, లీటర్ డీజిల్ రూ.101.24కు చేరిందని చెల్లుబోయిన చెప్పారు. రాష్ట్రంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ఎక్కువగా ఉండటంతో, దేశం మొత్తం మీద ఇక్కడే పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయన్నారు. పెరిగిన ధరల వల్ల పెట్రోల్‌పై రోజూ రూ.3.29 కోట్లు, డీజిల్‌పై రూ.6 కోట్లు అధిక భారం రాష్ట్రంలో వాహనదారులపై పడుతోందని, ఇలా రాష్ట్ర ప్రజలపై నెలవారీ పెట్రోల్‌పై రూ.98.7 కోట్లు, డీజిల్‌పై రూ.180 కోట్ల చొప్పున భారం పడనుందన్నారు. ఆ మేరకు ఏడాదికి పెట్రోల్‌పై రూ.1,201 కోట్లు, డీజిల్‌పై రూ.2,190 కోట్ల చొప్పున మొత్తంగా రూ.3,391 కోట్ల అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలు భరించాల్సి ఉంటుందని చెల్లుబోయిన ప్రజలకు పెట్రో ధరల పెంపు వల్ల కలిగే నష్టాలను వివరించారు.

**ఎన్నికల ముందు చంద్రబాబు, నారా లోకేష్ మాటలు..**

'ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై రాష్ట్రం వేసే పన్నే అందుకు కారణం అని, టీడీపీ అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్‌పై వేసిన పన్నును తగ్గిస్తామని.. దాని వల్ల రాష్ట్రంలో అన్ని ధరలు తగ్గుతాయి'.. అని ఎన్నికల ముందు చంద్రబాబు, నారా లోకేష్ ఊదరగొట్టారన్నారు. ఇంకా ప్రజలను నమ్మించేందుకు మ్యానిఫెస్టోలో కూడా పెట్టి, ఇక్కడా మాట తప్పారని, ఇప్పుడు పన్ను తగ్గింపుల ఊసే ఎత్తడం లేదని చెల్లుబోయిన మండిపడ్డారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా.. 'ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు భారీగా పెరిగాయి. ప్రజలంతా పొదుపు పాటించేలా అవగాహన కల్పించాలి. పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలి. తక్కువ దూరాలకు సైకిళ్లను వినియోగించాలి. కార్ పూలింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. వారంలో ఒకరోజు నో వెహికల్ డే గా పాటించాలి'.. అని చంద్రబాబు నిస్సిగ్గుగా, నిర్లజ్జగా మాట్లాడుతున్నారని చెల్లుబోయిన తీవ్ర విమర్శలు చేశారు. ఇదీ చంద్రబాబు రెండు నాల్కల ధోరణి. ప్రజలను దగా చేసే విధానం అన్నారు.

**రాష్ట్రంలో వ్యాట్ వాత..**

మన రాష్ట్రంలో అత్యధికంగా లీటర్ పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్‌తో పాటు రూ.4లు ఇంకా.. మరో ఒక్క రూపాయి రోడ్డు డెవలప్‌మెంట్ సెస్‌గా వసూలు చేస్తున్నారని, అదే విధంగా లీటర్ డీజిల్‌పై 22.25 శాతం వ్యాట్‌తో పాటు రూ.4 ఇంకా.. మరో రూపాయి రోడ్ డెవలప్‌మెంట్ సెస్ కింద వసూలు చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే, అవన్నీ తగ్గిస్తామని నాడు హామీ ఇచ్చిన చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్, ఇప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడడం లేదన్నారు. అందుకని ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని చెల్లుబోయిన పిలుపునిచ్చారు. ఈ విషయంలో అంతా కలసి రావాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. చంద్రబాబుకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, ఇతర బాదుడు తగ్గించి, ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నక్క రాజబాబు, పార్టీ సీనియర్ నాయకులు మింది నాగేంద్ర, డబ్బింగ్ రమేష్, కొప్పినీడి రాజమౌళి, తాడాల చక్రవర్తి, విప్పర్తి ఫణి, చీకురుమల్లి చిన్న, ఆచంట మారుతీ దేవి, సయ్యద్ రుఖియా, ఊటుకూరు శైలజ, సింహాద్రి రామలక్ష్మి, షేక్ మున్నిసా, వెలుగుబంటి అచ్యుతరామయ్య, తిరుమల శెట్టి శ్రీను, సాపిరెడ్డి సూరిబాబు, సామిరెడ్డి కామేష్, అయినవిల్లి వెంకటేశ్వరరావు, గోవింద్, అయినవిల్లి సత్య ప్రసాద్, అత్తిలి భీమశంకరం, బొప్పన సుబ్బారావు, సిరసపల్లి శంకర్రావు, ముద్దాల అను, రేలంగి సత్యనారాయణ, వేమల ఏసుబాబు, యెజ్జల రాంబాబు, బొమ్మ శ్రీను, దత్తసాయి, వడిసెల నారాయణ, కుప్పల రాంబాబు, ఇబ్రహీం భాషా, షట్టర్ భాష, పందిళ్ళ భాను ప్రసాద్, చొల్లంగి సత్యగిరి, దాసరి ధర్మ, గూటం రాజు, ముత్యాల జాన్, గోలి దేవకుమార్, నంబూరి రవి, ట్రేడ్ యూనియన్ నాయకులు రెడ్డి బాబు, వైఎస్ కుమార్, తోదేటి రాహుల్, హమీద్ భాష దారపు రామకృష్ణారెడ్డి, నెల్లి సర్వేశ్వరరావు, దుంపా చంద్రారెడ్డి, కర్రి బాబ్జి రెడ్డి, డాక్టర్ ఇమామ్ బాబ్జి, చింతపర్తి రాంబాబు, పడమటి కామరాజు, కే వెంకటరత్నం, పెనుమాక సునీల్, ఉండ్రాజవరపు సూర్య, కదల్ రాంబాబు పల్లేటి చిన్న, షేక్ నన్ను, షేక్ అస్లాం, సయ్యద్ బాబు, దాకే శీను, తరాటి శీను, సాపిరెడ్డి పండు, చాప రాజా, ఓదూరి రామకృష్ణ, వాసంశెట్టి శ్రీను, ఆరిగేలా హరీష్, కల్లూరి చైతు, మేడిశెట్టి కిరణ్, చేరకని లోకేష్, కట్టా జమిందర్, గుత్తుల హరికృష్ణ, కోటిపల్లి రవి, కమిడి రాజకుమార్, చింతపల్లి రాజకుమార్, చీరా గణేష్, షేక్ చానా, మాలేటి రమేష్, కానేటి యేసు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలపై ఆందోళన




తాడేపల్లిగూడెం (మనసులో మాట), మే 18 : పెట్రో డీజిల్ ధరల పెంపుదలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మోదీ ప్రభుత్వం వైఫల్యమని విమర్శించారు. ఎన్నికల ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం మోదీ సర్కారు దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. పెరిగిన ధరల వల్ల రవాణా ఖర్చులు పెరిగి, ప్రతీ వస్తువు ధర సామాన్యుడికి భారంగా మారుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు అందుబాటులో ఉన్నా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గ చర్య అని ఆయన విమర్శించారు. సిపిఐ నాయకులు వద్దాది మేరీ, నాగరాజు నాగలక్ష్మి, చింతాడ పద్మావతి, సరోజ, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.



## చెరువులలో మట్టి తవ్వకాల నిబంధనలను

# కఠిన తరం చేయాలి

### - పీజీఆర్ఎస్ లో బీజేపీ 'జనతా వారధి' ఫిర్యాద

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** జిల్లా వ్యాప్తంగా చెరువులలో మట్టి తవ్వకాల నిబంధనలను కఠినతరం చేయాలని, వినియోగించదగ్గ మట్టిని కుమ్మరి వర్గానికి ఉచితంగా ఇవ్వాలని, తద్వారా ప్రాంతీయ చేతివృత్తులను కాపాడాలని బీజేపీ 'జనతా వారధి' డిమాండు చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా జనతా వారధి కన్వీనర్ శివరామకృష్ణరాజు వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వ కాలంలో చెరువుల తవ్వకాలలో జరిగిన అక్రమాలపై కమిటీ ద్వారా విషయ నిర్ధారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకృతిని కాపాడుతూ చెరువులు, నీటి కుంటల ద్వారా సాగునీటి వ్యవస్థను పునర్నిర్మించే విధంగా ప్రయత్నం చేయాలని, ప్రతి క్యూబిక్ మీటర్ కు డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, తప్పనిసరి చేసి ప్రయోజనాలు ప్రతి వ్యక్తికి అందే విధంగా చూడాలని కోరారు. చెరువు మట్టి రైతుల హక్కు..అది కొందరి వ్యాపార వస్తువు కాదు అనే విధంగా ప్రభుత్వ అధికారులు వ్యవహరించాలని వినతి పత్రం అందించామని శివరామకృష్ణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కురగంటి సతీష్, జనతా వారధి కో కన్వీనర్ యానాపు ఏసు, బండి సత్యప్రసాద్, మీనాక్షి రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు పీజీఆర్ఎస్ లో 55 ఫిర్యాదులు: ఎస్పీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ", "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించారు. కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెను వెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. కాగా పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 55 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ డీ నరసింహ కిశోర్ తెలిపారు. వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు.

# ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నాం

### - కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ - గూడెంలో డయాలసిస్ సెంటర్ భవనానికి శంకుస్థాపన



**తాడేపల్లిగూడెం (మనసులో మాట), మే 18 :** ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.రెండు కోట్లతో నిర్మించనున్న డయాలసిస్ సెంటర్ భవనానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఇప్పటికే డయాలసిస్ సెంటర్ ఉందన్నారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో డయాలసిస్ సెంటర్ లేదని, రోగుల అవసరాల దృష్ట్యా ఇక్కడ డయాలసిస్ సెంటర్ భవనాన్ని సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చాలా చోట్ల డయాలసిస్ రోగులకు స్లాట్లు లభించని పరిస్థితి ఉందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే భారీ మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్నట్లు వివరించారు. గతంతో పోల్చుకుంటే తాడేపల్లిగూడెంలో రహదారులు విస్తరణకు నోచుకున్నట్లు తెలిపారు. స్విమ్మింగ్ పూల్, యోగా సెంటర్, జిల్లా పరిషత్ హై స్కూల్ అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. క్షేత్రస్థాయిలో ఎవరైతే పనిచేసి ప్రజాప్రతినిధులుగా ఎదుగుతారో వారు సమర్థవంతంగా పనిచేయగలరన్నారు. తద్వారానే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగిన వ్యక్తి శ్రీనివాస వర్మ అని కొనియాడారు. డయాలసిస్ రోగులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగానే రూ.రెండు కోట్లు మంజూరు చేశారన్నారు. రైల్వే స్టేషన్ ను రూ.40 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నియోజవర్గ అభివృద్ధికి కేంద్ర మంత్రిగా శ్రీనివాస్ వర్మ అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధ వాతావరణంతో వణుకుతున్నాయన్నారు. అయితే, ప్రధాని నరేంద్ర మోడీ పాలన దక్షతతో భారతదేశ ప్రజలు గుండెలపై చేతులు వేసుకుని ధైర్యంగా నిద్రపోతున్నారన్నారు. టిడిపి, బిజెపి నాయకులు తాతాజీ, టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, నియోజకవర్గ పీ-4 ప్రత్యేక అధికారి జీవీకే. మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసు బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ పాలనలో భయానక వాతావరణం

### - కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**తాడేపల్లిగూడెం (మనసులో మాట) మే 18 :** గతంలో 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ పాలనలో భయానక వాతావరణం నెలకొందని, ప్రస్తుతం కూటమి పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటలో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉండటం వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వే చేసి భూ వివాదాలు లేని విధంగా పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో పట్టాదారు పాస్ పుస్తకాలు, కోడిగుడ్లపై సైతం జగన్ తన ఫొటో ముద్రించారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం రూ.50 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చిన ఘనత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే దక్కుతుందన్నారు. మరొక 15 ఏళ్ళు నరేంద్ర మోడీ సర్కార్ లేకపోతే భారతదేశం అధోగతి పాలవుతుందన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. గతి శక్తి పథకంలో రూ.200 కోట్లు ఆర్వోబీలు, స్మశాన వాటికల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేశారన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి జీవీకే మల్లికార్జునరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నాన్ స్టాప్ లకూ పల్లె వెలుగులే

### - ఎత్తు పల్లాలలో ట్రంకు పెట్టి మోతలే - పల్లె వెలుగుకూ నాన్ స్టాప్ చార్జీలే - ఇష్టం వచ్చినట్లు సర్వీసులు

### - ప్రయాణికుల సేవలకు తిలోదకాలు - ఆవేదన వ్యక్తం చేస్తున్న సామాన్యులు



**నూజివీడు (మనసులో మాట) మే 18:** నూజివీడు నుండి ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని విజయవాడ నగరానికి వెళ్లేందుకు నాన్ స్టాప్ సర్వీసుల కోసం వేచి చూసే సామాన్యులకు ఏపీఎస్ఆర్టీసీ నూజివీడు డిపో దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. నాన్ స్టాప్ సర్వీసుల పేరుతో పల్లె వెలుగు సాధారణ బస్సులను నడుపుతోంది. పల్లె వెలుగు బస్సులలో వెళ్లే ప్రయాణికులకు నాన్ స్టాప్ బస్సు చార్జీలనే వసూళ్లు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల డిమాండ్ మేరకు సర్వీసులను నడపవలసిన ఏపీఎస్ఆర్టీసీ డిపో అధికారులు పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తున్న తీరు పలువురు విస్మయానికి గురిచేస్తుంది. ప్రయాణికులన్నా, వారికి అందించవలసిన కనీస సౌకర్యాలన్నా అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. గతుకుల రోడ్డులలో పల్లె వెలుగు బస్సులను తిప్పుతూ... నాన్ స్టాప్... ఎక్స్ప్రెస్ చార్జీలను వసూళ్లు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా,రాష్ట్ర స్థాయి అధికారులు ఎవరైనా వస్తే బస్టాండ్.... గ్యారేజీ పరిశీలించి... బస్టాండులో ఉన్న ఒకరిద్దరు ప్రయాణికులతో ముచ్చటించి వెళ్ళిపోతున్నారని... బస్టాండ్ బయట నిల్చున్న ప్రయాణికులను గాని... పల్లె ప్రాంతాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించి అక్కడ ప్రయాణికులను గాని ప్రశ్నిస్తే అసలు నిజాలు బయటపడతాయని పలువురు సామాజికవేత్తలు పేర్కొంటున్నారు. స్త్రీ శక్తి పథకంతో ఉచిత బస్సు ప్రవేశపెట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం ఏపీఎస్ఆర్టీసీ బస్టాండులను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, కనీస సౌకర్యాలను ఎంతో పటిష్టంగా ఏర్పాటు చేస్తోంది. అధికారులలో మాత్రం ఉదా సేన వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే తీరు అధికారులలో కొనసాగితే ఇక సామాన్యులు ఆర్టీసీ బస్సులు ఎక్కే పరిస్థితి ఉండదని పలు ప్రజాసంఘాల నాయకులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కళ్ళు తెరిచి వాస్తవాలు గ్రహించి సామాన్య ప్రజానీకానికి కనీస సౌకర్యాలు, సరైన సౌకర్యవంతమైన బస్సు సర్వీసులను ఏర్పాటు చేసి ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు.



## అధికారుల నిర్లక్ష్యంపై ఏలేశ్వరం

# ఎంపీటీసీల ఆగ్రహం..

## - సమావేశం బహిష్కరణ

ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి నరసింహామూర్తి అధ్యక్షతన నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఉద్రిక్తంగా మారింది. మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, అధికారుల నిర్లక్ష్య ధోరణిపై పలువురు ఎంపీటీసీ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశంలో ఎంపీపీ నరసింహామూర్తి మాట్లాడుతూ.. మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలుమార్లు సూచించినా ఫలితం కనిపించడం లేదన్నారు. ప్రజాప్రతినిధుల మాటలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలోని కొందరు అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయని, అవినీతి ఆరోపణలపై పదేపదే ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించడం లేదని ఎంపీపీ ఆరోపించారు. ముఖ్యంగా ఏపీఎం మరియు వారి కార్యాలయ సిబ్బంది అవినీతి చర్యలకు పాల్పడుతున్నారని, ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదని, సమావేశాలకు కూడా హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీలు మండిపడ్డారు.

"ఎంపీపీగా నా పరిస్థితి కూడా ఇదే. మండల అభివృద్ధే లక్ష్యంగా గౌరవంతో పనిచేస్తున్నా అధికారుల వ్యవహారశైలిలో మార్పు కనిపించడం లేదు. ఆధారాలతో సహా పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక ఏమి చేయాలో మీరే చెప్పండి" అంటూ ఎంపీపీ సభలో సభ్యులను ప్రశ్నించారు.

దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీటీసీ సభ్యులు.. "ఎంపీపీ మాటకే విలువ లేకపోతే, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల స్థానాలకు గౌరవం లేకపోతే ఈ సమావేశాలకు అర్థమేంటి?" అంటూ మండిపడ్డారు. అధికారులు ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీటీసీలు ఒకేసారి సమావేశం హాల్‌ను వీడి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటనతో మండల ప్రజా పరిషత్ సమావేశం ఉద్రిక్త వాతావరణంలో ముగిసింది.

## గోకవరం నుండి జగ్గంపేటకు తరలి వెళ్లిన వైసీపీ నాయకులు




**గోకవరం (మనసులో మాట), మే 18 :** రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు తోట నరసింహం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పెట్రోలు డీజీలు పై పెరిగిన ధరలు కారణంగా సోమవారం జగ్గంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి జగ్గంపేట సెంటర్లో గల తహసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర గా రైతాంగానికి సంబంధించిన ట్రాక్టర్ ర్యాలీతో నిరసన తెలియజేసి తహసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి గోకవరం మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లి నిరసన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణలో ప్రజల భాగస్వామ్యం



**ఏలూరు,మే,18(మనసులో మాట)..** జిల్లాలో ఈనెల 18 నుంచి 25 వరకు జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం అమలుపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించి సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం మరియు అమలు, పర్యవేక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా 18.05.2026 నుండి 25.05.2026 వరకు జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా అవగాహన శిబిరాలు, గ్రామ సమావేశాలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు పరస్పర చర్చా కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వ శాఖలు, ప్రజల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలన్నారు. ముఖ్యంగా గిరిజన,గ్రామీణ మరియు వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. జన్ భాగీదారి అభియాన్ కింద ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమాజ బాధ్యత, సామూహిక చర్యను ప్రోత్సహించాలన్నారు. పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. సామాజిక సంక్షేమం, ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ మరియు జీవనోపాధి కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి గిరిజన కుటుంబానికి అవసరమైన ప్రభుత్వ సేవలు , సామాజిక-ఆర్థిక ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రజలు సమగ్ర లబ్ధి సంతృప్తి (ఖఅఅజవతీయిశ్రీ దీవఅవటఱ రాఫ్‌బతీఫ్‌అశీఅ) సంతృప్తి పొందేలా గ్రామస్థాయి శిబిరాల ద్వారా ఆధార్ కార్డులు , ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు , జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తక్షణమే జారీ చేయడం లేదా నవీకరించడం చేయాలన్నారు. సామాజిక మరియు ఆర్థిక భద్రతకల్పించేందుకు పీఎం-కిసాన్ యోజన ,సామాజిక భద్రత పెన్షన్ పథకాలు ,బీమా పథకాలు ,నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ వంటి కార్యక్రమాలు నమోదు చేయాలన్నారు. సమగ్ర గిరిజన సాధికారత కింద పీఎం-జన్మన్ (ఁవీ-జీూచీవీూచీ) , ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ వంటి ముఖ్య పథకాల చివరి దశ అమలుకు ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలవాలన్నారు. అదే విధంగా గిరిజన సాంస్కృతిక సమగ్రతను పెంపొందించేందుకు సాంప్రదాయ గిరిజన కళారూపాలు, స్థానిక గిరిజన భాషలు పరిరక్షణ ప్రోత్సహించాలన్నారు. గిరిజన నాయకులు, ముఖ్యంగా భగవాన్ బిర్సా ముండా ("ధర్తి ఆబా")ని స్మరించుకోవడం చేయాలన్నారు.

# సముద్రపు కోతను అరికట్టడంలో గ్రోయిన్లు కు అత్యంత ప్రాధాన్యత - కలెక్టర్



**అమలాపురం( మనసులోమాట) మే 18:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు వద్ద ఓఎన్జిసి ప్లాంట్ రక్షణ, గ్రామ సముద్రపు కోతను అరికట్టడంలో గ్రోయిన్లు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయని ఆ దిశగా ఓడలరేవు వద్ద 21 గ్రోయిన్లు 26 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ సముద్రపు కోతను అరికట్ట డానికి గ్రోయిన్లు అద్భుత మైన మార్గమని అయితే, వీటిని నిర్మించే ముందు సముద్రపు అలల దిశ, ఇసుక ప్రవాహంపై పూర్తిస్థాయి శాస్త్రీయ అధ్యయనం చేయడం జరిగిందన్నారు. సాంప్రదాయక నిర్మాణాలు. తీరప్రాంతాన్ని కాపాడుకోవడానికి ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. ఆ దిశగా రెవెన్యూ అటవీ శాఖలు ఓఎన్జిసి వారి సహకారంతో భూసేకరణ పనులు పూర్తి కాబడి గ్రోయిన్ల నిర్మాణానికి చర్యలు ప్రారంభించామన్నారు. సేకరించిన భూములలో రెవెన్యూ అటవీ భూములు ఉన్నాయన్నారు గ్రోయిన్లు అనేవి సముద్ర తీరానికి లంబంగా నిర్మించే గట్టి నిర్మాణాలని, పెద్ద పెద్ద రాళ్ల కాంక్రీట్ బ్లాకు లుగా నిర్మించడం జరుగుతుందన్నారు. సముద్రపు అలలు తీరానికి వాలుగా తాకినప్పుడు తీరంలోని సముద్ర అలల ద్వారా కొట్టుకుపోయే ఇసుకను గ్రోయిన్లు అడ్డుకుంటాయన్నారు దీనివల్ల గ్రోయిన్ ఉన్న వైపు ఇసుక పేరుకు పోయి, కొత్త గా బీచ్ ఏర్పడుతుంది లేదా ఉన్న బీచ్ వెడల్పు పెరుగు తుందన్నారు. గ్రోయిన్లు సముద్ర పు అలల తీవ్రత ను వేగాన్ని తగ్గిస్తాయన్నా యన్నారు. ఫలితంగా అలలు తీరాన్ని బలంగా తాక లేవని తద్వా రా కోత తగ్గుతుందన్నారు. తీర ప్రాంతంలో ఇసుక కొట్టు కుపోకుండా ఆపి, పర్యాటకానికి పనికొచ్చేలా బీచ్‌ల ను స్థిరంగా ఉంచు తాయన్నారు. తీరానికి దగ్గరగా ఉన్న గ్రామాలు, రోడ్లు, మత్స్య కారుల ఇళ్లను సముద్రం ముందుకు చొచ్చుకురాకుండా కాపాడ తాయన్నారు .స్థానిక ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలో నిర్మించే గ్రోయిన్ వల్ల అలల ప్రభావాన్ని నియం త్రించి ఇసుక తరలింపును తగ్గించడానికి ఉపయోగ పడుతుంద న్నారు. నిర్మాణం వల్ల తీర క్షీణత తగ్గి తీర ప్రాంతం రక్షించబడు ఉందన్నారు. విశాలమైన బీచ్ ఏర్పడి పర్యాటక అభివృద్ధికి సహాయపడు తుందన్నారు. వరదలు తుఫాన్ల ప్రభావం తగ్గుతుందన్నారు. సముద్ర అలల తీవ్రత కొంతవరకు నియంత్రించ బడటం వల్ల తీరప్రాంత నష్టం కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ఎం వి ప్రసాద రావు, ఓఎన్జిసి ఓడలరేవు ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న కంబాల - అన్నసంతర్పణకు కంబాల 500 కిలోల బియ్యం విరాళం



**గోకవరం (మనసులో మాట), మే 18 :** గోకవరం మండలం గుమ్మళ్ళ దొడ్డి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి పురస్కరించుకొని సోమవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన కంబాల స్వామివారికి పండ్లు, వస్త్రాలకు సమర్పించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రామసేన సంస్థను స్థాపించి గత మూడేళ్లుగా మూడు నియోజకవర్గాల్లో ప్రజలకు విద్య, వైద్య, ఆర్థికపరంగా విశేష సేవలు అందిస్తూ ఆలయాల అభివృద్ధికి, నూతన ఆలయాల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ముందు, ముందు కూడా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నసంతర్పణ కార్యక్రమానికి కంబాల 500 కిలోల బియ్యం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కంబాల యువసేన అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, నాగ రమేష్, వీరాంజలి, కరిబండి వెంకటేశ్వరావు, గౌతమ్, వేగి సాంబశివరావు, బుల్లబ్బాయి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు



## పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష...

### సమీక్షకు హాజరైన

### మంత్రి నిమ్మల, ఛైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ...

మండపేట (మనసులో మాట ) మే 18

పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు , రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇటీవల విడుదల చేసిన ఇరిగేషన్ క్యాలెండర్‌కు అనుగుణంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులో పూర్తి కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వాటర్ మేనేజ్మెంట్‌లో సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా భూగర్భ జలాల సద్వినియోగం కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి ప్రాజెక్టుల అమలులో వేగం పెంచాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ , ముఖ్యమంత్రి కార్యదర్శి ఏ.వి రాజమౌళి , ఇరిగేషన్ చీఫ్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**నూజివీడు (మనసులో మాట) మే 18:** మొక్కజొన్న రైతులను మోసగిస్తున్న సీడ్ మొక్కజొన్న కంపెనీలు, కంపెనీ ప్రతినిధులపై కఠినంగా వ్యవహరించాలని సిపిఐ అనుబంధ రైతు సంఘం నాయకులు చలసాని వెంకట రామారావు, నిమ్మగడ్డ నరసింహ, పామర్తి వెంకట నాగేంద్రరావు లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న సీడ్ సాగు కోసం రైతులను ఏమార్చి, కల్లబొల్లి మాటలతో ప్రలోభాలకు గురిచేసి పబ్బం గడుపుకుంటున్నట్లు తెలిపారు. దిగుబడి వచ్చే సమయానికి కంపెనీ ప్రతినిధులు చెప్పిన దిగుబడిలో సగం కూడా రావడం లేదన్నారు. దిగుబడి సక్రమంగా రాకుంటే ఎకరాకు కనీసం నాలుగు టన్నుల చొప్పున నగదు చెల్లిస్తామని నమ్మబలికి, చివరికి వచ్చేసరికి రైతాంగాన్ని పూర్తిగా మోసగిస్తున్నారని వాపోయారు. విత్తన కంపెనీ ప్రతినిధులు, యజమానులను కఠినంగా శిక్షించి, రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నష్ట పరిహారం అందే వరకు రైతుల కోసం, వారి పక్షాన విశ్రాంత పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# ఆ పరామర్శ.. తెర వెనుక కథేంటి?!

### -పవన్ కళ్యాణ్ ను ప్రధాని పరామర్శించిన ఘటన వెనుక కథనాలకు సమాధానం ఏంటి?

### -ప్రజల అనుమానాలు, సందేహాలకు సమాధానాలు చెప్పేవారెవరు???

### -ప్రధానికి ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ సూటి ప్రశ్నలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:**"ప్రధాని అంటే ప్రజలకు భరోసాగా ఉండాలి..భారంగా వుండకూడదు. బంగారం కొనొద్దు..పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోండి అని భవిష్యత్తును నిరాశ పరిచే విధంగా ప్రధాని ప్రకటన చేయటం భారతదేశ ప్రతిష్ఠకు అవమానంగా వుంది" అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనపై కొన్ని కార్పొరేట్ మీడియా కథనాలు ప్రకారం.. పవన్ కళ్యాణ్ ను పరామర్శించటానికి వచ్చినట్టు లేదని మేడా తన సందేహాన్ని వ్యక్తం చేశారు. ఆ వంకతో ఇతర రాజకీయ ప్రయోజనాలు, కొన్ని రహస్య మంతనాలు జరుపుకోవటానికి వచ్చినట్టుగా వుందనే అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. శాంతి భద్రతలు, మత వివాదాలే మోదీ ప్రధాన రాజకీయ అజెండాగా కనపడుతోందన్నారు. అపార సహజ వనరులు గల ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రానికి ప్రధాని మోదీ ప్రకటన వర్తించదన్నారు. మోదీ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మాయ చేస్తూ మోసం చేస్తున్నారని మేడా ఆరోపించారు. మోదీ రాజకీయ మంతనాలకు పవన్ కళ్యాణ్ పరామర్శ ఒక కుంటి సాకు మాత్రమేనని, మోదీ హైదరాబాద్ పర్యటన లో తెలంగాణా రాజకీయ అంశంతో బాటుగా బండి సంజయ్ కుమారుడు బండి భగీరధ్ ఫోక్సో కేసు కూడా దాగి వుందా అనే అనుమానం అందరికీ కలుగుతోందన్నారు. మోదీ ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాలను పచ్చిగా మోసం చేస్తున్నారని, రేవంత్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు



నిర్ణయం పై ప్రధాని మోదీ సమక్షంలో చంద్రబాబు - లోకేష్ ఒక హామీ ఇచ్చినట్టు విశ్వాసనీయ వర్గాల భోగట్టాగా గుసగుసలు వినిపిస్తున్నాయని..వీటిలో నిజమెంతో తెలియదన్నారు. ప్రధాని మోదీ హైదరాబాద్ లో పవన్ కళ్యాణ్ ను పరామర్శించిన ఘటనలో మర్మం వుందని రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్ లను పవన్ కళ్యాణ్ ను ప్రధాని విడివిడిగా కలసిన ఆంతర్యం కూడా అదే కదా.. చిరంజీవి హైదరాబాద్ ప్రధాని పర్యటనకు దూరంగా ఉండటానికి కారణం కూడా అనేక అనుమానాలకు దారి తీస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ భవిష్యత్తు రాజకీయ వ్యూహంగా ఉంటుందని, తెలంగాణాలో బీజేపీ కనుసైగలో నడిచే రాజకీయ నేత, రాజకీయ పార్టీయే ఉండాలి.. భారత దేశంలో కాంగ్రెస్ కు ప్రస్తుతం పట్టున్న తెలంగాణా రాష్ట్రంలో కోలుకోలేని దెబ్బ కొట్టటమే మోదీ - చంద్రబాబు రాజకీయ వ్యూహం కాదంటారా..అని మేడా శ్రీనివాస్ ఆ లేఖలో సూటిగా ప్రశ్నించారు. ఒకప్పుడు ఎన్నికల్లో గెలిస్తేనే ఆ రాజకీయ పార్టీ అధికారం చేపట్టేదని, ప్రస్తుతం మోదీ - అమిత్ షా రాజకీయ మార్కు అంతా అని, పార్టీ జెండా ప్రభుత్వాలు అక్కర్లేదన్నారు. మోదీ - అమిత్ షా లకు వంగి గులాం గిరికి సిద్ధమైతే చాలన్నారు. మోదీ - అమిత్ షా రాజకీయ వ్యూహాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో సొంత నియోజకవర్గాల అభివృద్ధి కోసం, ప్రజా సమస్యలు కోసం గాని చట్ట సభల్లో ప్రశ్నించే నేతలు లేకపోయారని మేడా ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ఎమ్మెల్యే, ఎంపీలు బైరాగి జీవితాలకు బానిసలుగా మారిపోయారని వ్యాఖ్యానించారు. నేటి ఎన్నికలు మొత్తం విధానం గెలిచినోడికి ఎందుకు గెలిచారో, ఎలా గెలిచారో కూడా తెలియదని, ఒడినోడికి ఎలా ఓడిపోయాడో కూడా తెలియటం లేదన్నారు. చివరకు ఓటర్లు ఎవరికి ఓటు వేశారో తెలియని నిస్సహాయ స్థితి సమాజాన్ని వెంటాడుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణాలో వచ్చే రాజకీయ తిరుగుబాటు ఒక్కటే.. మోదీ అధికారాన్ని దూరం చేస్తుందని మేడా జోస్యం చెప్పారు. ఒకప్పుడు ఈ రెండు తెలుగు రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం నేటికీ సోనియా గాంధీ అనుభవిస్తున్నారని, మున్ముందు ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాలకు అద్భుతమైన బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు చైతన్యవంతులై రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుని, ప్రజాస్వామ్య విలువలకు నష్టం వాటిల్లకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మేడా పిలుపునిచ్చారు.

# నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదా?!

### - శానిటేషన్ సిబ్బంది జీతాల జాప్యంపై కలెక్టర్ అసంతృప్తి - బాధ్యులకి షోకాజ్ నోటీసులు జారీ చేయమని ఆదేశాలు

### - క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** పంచాయతీ రాజ్ వ్యవస్థలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంపై కలెక్టర్ కీర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ అనంతరం జిల్లా అధికారులతో పాటు




జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న అధికారులతో ఈ విషయమై ఆరా తీశారు. ప్రభుత్వం పారదర్శకంగా పౌర సేవలు అందించే క్రమంలో రెండు నెలల క్రితం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు అధికారులు వివరణ ఇచ్చినప్పటికీ, గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణ కోసం పని చేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకం అయి సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ప్రజా సమస్యలను కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాలు, మండలాల్లో ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ప్రతి సోమవారం, గురువారం జిల్లా స్థాయి అధికారులు తమ ప్రధాన కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని, మిగిలిన రోజుల్లో క్షేత్ర స్థాయిలో పర్యటన చేయాలని స్పష్టం చేశారు. ప్రజల వినతులు, భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు సేవలు అందించడంలో ఆలస్యం లేదా నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్లు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. గ్రామస్థాయి అధికారులు, సిబ్బందిపై పూర్తిగా ఆధారపడడం వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నట్లు గమనించామని తెలిపారు. భూ వివాదాలు, సర్వే సమస్యలు, ప్రజల ఫిర్యాదులను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా మాత్రమే సమర్థవంతమైన పరిష్కార మార్గాలు చూపగలమన్నారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ప్రజల సమస్యలపై స్పందన వేగవంతం చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, ప్రభుత్వ సేవలు పారదర్శకంగా ప్రజలకు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



## మండుతున్న ఎండల్లో మానవత్వం చాటిన... సమైక్య వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్

**కాకినాడ (మనసులో మాట) మే 18..** కాకినాడ గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ మెయిన్ రోడ్డు మీద సమైక్య వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో భారీగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.కాకినాడ నగరంలో భానుడి భగభగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, సమైక్య వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ యూనియన్ గవర్నమెంట్ జి.బి.హెచ్ మెయిన్ రోడ్ లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజలకు చల్లని ఉపశమనం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.జి.జి .హెచ్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, ఆటో డ్రైవర్లు, కార్మికులు, ప్రయాణికులకు చల్లని మజ్జిగను ఏర్పాటు చేశారు. మండుతున్న ఎండల్లో దాహార్తితో అలసి పోయిన ప్రజలు మజ్జిగ సేవించి ఉపశమనం పొందారు.ఈ సందర్భంగా సమైక్య వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాపికులు, కాకినాడ జిల్లా అధ్యక్షులు కొంగు. సందీప్ రాజు మాట్లాడుతూ, జర్నలిస్టులు వార్తలకే పరిమితం కాకుండా సామాజిక సేవలో కూడా ముందుంటారని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బలకు గురికాకుండా చల్లని పానీయాలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. అలాగనే మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు సమైక్య వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ తరపున చేస్తామని పేర్కొన్నారు.ఈ సేవా కార్యక్రమం లో సమైక్య వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాపికులు కాకినాడ జిల్లా అధ్యక్షుడు కొంగు సందీప్ రాజ్, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షురాలు కొంగు జాక్విలిన్ , కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు బుంగ. సత్యనారాయణ, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి బోరా విజయ్, కాకినాడ జిల్లా కార్యదర్శులు ఎం. శ్రీధర్, జె. స్వామి, ట్రెజరర్ పి. రామకృష్ణ శర్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పి. అశోక్, జోడ చైతన్య కుమార్, యు.దుర్గారావు డి.భూపతి రాజా, టి. కృష్ణ, పెద్దిరెడ్డి నరేష్ కుమార్, యువకులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో నిర్వాహకులను పలువురు అభినందించారు.

## ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీ



**పిఠాపురం, (మనసులో మాట) మే 18:** ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం ఇందిరానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో వినూత్న అవగాహన ర్యాలీ నిర్వహించారు. యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి జయరామ్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంల సిబ్బంది 'ఉప్పు రాక్షసుడి' ప్లకార్డులతో బీపీ నంబర్ల బోర్డులతో వినూత్నంగా ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బి జయరామ్ మాట్లాడుతూ.. హైపర్ టెన్షన్ (రక్తపోటు) అనేది ముందస్తు లక్షణాలు లేని 'నిశ్శబ్ద శత్రువు' అని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆహారంలో ఉప్పు తగ్గించడం, రోజుకు కనీసం 30 నిమిషాల నడక, ఒత్తిడి లేని జీవనశైలి ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చని వివరించారు.

# విద్యార్జనలో 'మెగాస్టార్' డాక్టర్ రామారెడ్డి

## సెంచరీకి చేరువలో నిత్య విద్యార్థి

- తాజా సెమిస్టర్ లో 16 కోర్సులు పూర్తి చేసిన డాక్టర్ రామారెడ్డి -12 కోర్సుల్లో టాపర్ గా నిలిచిన సరస్వతీ పుత్రుడు
- 10 కోర్సుల్లో ఎలైట్ గోల్డ్, 6 కోర్సుల్లో ఎలైట్ సిల్వర్ -వరుసగా నాలుగోసారి 'మెగాస్టార్' అవుతున్న నిత్య విద్యార్థి
- జీవితంలో చదువు భాగంగా మారిందన్న డాక్టర్ రామారెడ్డి -ఇది అద్భుతం, స్ఫూర్తిదాయకం అని పలువురి ప్రశంస
- డాక్టర్ కర్రి రామారెడ్డి విద్యాభ్యాస జీవితంలో మరో అద్భుత అధ్యాయం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** నిరంతరం అభ్యసిస్తూ, జ్ఞానవృద్ధిని జీవన విధానంగా మార్చుకుని చదువుకి ఎడిట్ అయిపోయిన డాక్టర్ కర్రి రామారెడ్డి మరో అరుదైన విద్యా మైలురాయి అధిగమించారు. ఇప్పటికే డాక్టరేట్లు, పీజీలు, డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సులు అన్నీ కలసి 73 పూర్తి చేయగా, తాజాగా ఈ- సెమిస్టరుతో మరో 16 కోర్సులు పూర్తిచేయడంతో 89కు చేరుకున్నాయి. ప్రస్తుతం ఆయన వయస్సు 71 సంవత్సరాలు.. అఫీషియల్ గా 73. ఈ వయస్సులో కూడా ఆయన నిత్య విద్యార్థిగా డిగ్రీల మీద డిగ్రీలు, సర్టిఫికెట్ కోర్సుల మీద సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేయడం సామాన్య విషయం కాదు. ఒక పక్క వైద్య వృత్తిలో ఉంటూ సైకియాట్రీ, సైకాలజీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, న్యాయ శాస్త్రం, ఎడ్యుకేషన్, ఆంగ్ల సాహిత్యం, లైబ్రరీ సైన్స్, యోగా థెరపీ, జర్నలిజం, కామర్స్, పొలిటికల్ సైన్స్ ఇలా అనేక విభాగాలలో, విశేషాధ్యయనం ద్వారా సంపాదించిన మొత్తం డాక్టరేట్లు, పీజీలు, డిగ్రీలు, డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సులు కలసి 89 పూర్తిచేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. స్థానిక దానవాయిపేటలోని మానస హాస్పిటల్ పైన సోమవారం ఉదయం జీఎస్ఎల్ వైద్య సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, ఐఎంఏ నగర కార్యదర్శి డాక్టర్ దాట్ల సతీష్ రాజు, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ, పీవీఎస్ కృష్ణారావులతో కల్సి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ రామారెడ్డి మాట్లాడారు. చదువు అనేది తన జీవితంలో భాగంగా మారిపోయిందన్నారు. అందుకే వచ్చే సెమిష్టర్ లో మరో 16 కోర్సులు పూర్తి చేస్తానని ఆయన ప్రకటించారు. దాంతో సెంచరీ దాటుతుంద న్నారు. తాను చేసి కోర్సులలో ఏదీ అయాచితంగా వచ్చిందో, గౌరవపూర్వక నామమాత్రపు అర్హతో కాదని, ప్రతి సర్టిఫికేషన్ పూర్తిగా పరీక్షల ఆధారంగానే సంపాదించానని డాక్టర్ రామారెడ్డి సోదాహరణంగా వివరించారు. పూర్తి సామర్థ్యంతో, శ్రమతో సాధించినవేనని అందుకే కష్టార్జితం, ఇష్టార్జితం అని ఆయన వ్యాఖ్యానించారు. జనవరి- జూన్ 2026 సెమిస్టర్ విద్యా విజయాలను డాక్టర్ రామారెడ్డి వివరిస్తూ, మొత్తం 16 నప్టల్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. అందులో 12 కోర్సుల్లో టాపర్ గా వచ్చినట్లు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 10 కోర్సుల్లో ఎలైట్ ప్లస్, గోల్డ్ అంటే పరమ విశిష్ట శ్రేణిలో ఉత్తీర్ణత సాధించగా, 6 కోర్సుల్లో ఎలైట్ ప్లస్ సిల్వర్ అంటే విశిష్ట శ్రేణిలో ఉత్తీర్ణత లభించిందని ఆయన చెప్పారు. ఇప్పటికే మూడు సార్లు మెగాస్టార్ అర్హత లభించగా, తాజాగా ఫలితాలతో నాలుగో సారి మెగాస్టార్ అర్హత వచ్చిందని, ఇది అరుదైన ఫోర్ ఫీట్ గా ఆయన తెలిపారు. అలాగే ఈ సెమిస్టర్లో పూర్తి చేసిన 16 ఎన్పి టెల్ కోర్సుల విషయానికీ వస్తే..కాన్పూర్, ఖరగపూర్ ఐఐటీల నుంచి మూడేసి కోర్సులు, రూర్కేలా, గువహతి ఐఐటీల నుంచి రెండేసి కోర్సులు పూర్తి చేయగా, మిగిలిన ఆరు కోర్సులు మద్రాస్ ఐఐటీ నుంచి పూర్తిచేసినట్లు డాక్టర్ రామారెడ్డి వివరించారు. ఐఐటీ అంటేనే కఠినమైన ఆన్ లైన్ కోర్సులు, పరీక్షలుగా డాక్టర్ రామారెడ్డి చెప్పారు. అన్ని పరీక్షలు స్థానిక రాజీవ్ గాంధీ కళాశాల కేంద్రంలో నిర్వహించబడ్డాయని, చాలా కఠిన నిబంధనలతో పరీక్షలు జరిగాయని పరీక్షలు రాసేవారి దగ్గరే కాదు, సెక్యూరిటీ దగ్గర కూడా సెల్ ఫోన్లు ఉండవని ఆయన సోదాహరణంగా కఠిన నిబంధనల గురించి వివరించారు. రికార్డుల కోసమో, మరొకటి కోసమో కాకుండా చదువు అనేది తన జీవితంలో నిత్య భాగంగా చేసుకున్నానని డాక్టర్ రామారెడ్డి స్పష్టం చేశారు. మానసిక వైద్యునిగా ఒక లక్షా 47వేల 250మంది పేషేంట్లకు వైద్యం చేశానని, దాదాపు ఒక లక్షా 50వేల కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**డాక్టర్ రామారెడ్డి ప్రపంచానికే దిక్సూచి: డాక్టర్ గన్ని**

డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ సంస్కృతిక నగరమైన రాజమహేంద్రవరంలో 6 లక్షల జనాభాకే కాకుండా దేశంలో 140 కోట్లు, ప్రపంచంలో 750 కోట్ల జనాభాకు డాక్టర్ రామారెడ్డి ఒక దిక్సూచిగా అభివర్ణించారు. ఏదైనా సంపాదించవచ్చు గానీ విద్యను సంపాదించడం కష్టమని ఆయన అన్నారు. అందునా వైద్య వృత్తిలో ఉంటూ విభిన్న కోర్సులు పూర్తిచేయడం డాక్టర్ రామారెడ్డికే చెల్లిందన్నారు. సరస్వతి ఘాట్ లో డాక్టర్ రామారెడ్డి పేరు ఉండేలా చేస్తే ఎందరికో స్ఫూర్తిగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఈ వయస్సులో ఇదొక అద్భుతం :ఓలేటి**

ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ రాముడు చిన్నప్పుడే వశిష్ట మహర్షి చెప్పిందే తడవుగా అందిపుచ్చుకున్నాడని, ఒక్కోసారి చెప్పకుండానే రాముడికి స్ఫురణకు వచ్చేదని అన్నారు. అందుకే రాముడు మంచి బాలుడు అనేది నానుడిగా మారిందన్నారు. అయితే రాముడు లాంటి వాళ్ళు చిన్నపుడు అద్భుతాలు సృష్టిస్తే, డాక్టర్ రామారెడ్డి 70 ఏళ్ల వయస్సు దాటిన తరువాత కూడా ఇంతటి తీవ్ర అధ్యయనం చేయడం అరుదైన విషయమే కాదు.. ఒక అద్భుతమని అన్నారు.

**డాక్టర్ రామారెడ్డి ఈ నగరానికి మణిహారం : హర్షకుమార్**

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ డాక్టర్ రామారెడ్డి ఈ నగరానికి మణిహారం లాంటివారని కొనియాడారు. అత్యంత ప్రతిభ గల డాక్టర్ రామారెడ్డిని అందరూ గుర్తించడమే కాదు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇటువంటి గొప్ప మానసిక వైద్యుడు రాష్ట్రంలో ఎక్కడా కన్పించరని ఆయన కితాబునిచ్చారు. మానసిక రోగులకు నయం చేయడంలోనే కాకుండా వారిపట్ల మిగిలినవారికి ఇబ్బంది కలగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా డాక్టర్ రామారెడ్డి చెప్పడంలో నేర్పరి అని సోదాహరణంగా ఒకటి రెండు స్వీయ సంఘటనలు ఆయన ప్రస్తావించారు. డాక్టర్ సతీష్ రాజు మాట్లాడుతూ డాక్టర్ రామారెడ్డి వైద్యులందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.


**విద్యకు వయసుతో పనిలేదు..**

ఇదంతా గమనిస్తే డాక్టర్ కర్రి రామారెడ్డి విద్యాభ్యాసం, ఆయన వయస్సు కేవలం సంఖ్య మాత్రమేనని, నేర్చుకోవడం అనేది జీవితాంతం కొనసాగించదగ్గదని నిరూపిస్తోంది. ఆయన అధ్యయనం, క్రమశిక్షణ, ఆసక్తి-కేవలం వ్యక్తిగత విజయాలనే కాదు. విద్య పట్ల స్ఫూర్తిదాయక సందేశంగా కూడా భావించాలనడంలో ఎలాంటి సందేహం లేదు.

# కోరుమిల్లి గ్రామం లో నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

## - లో వోల్టేజ్ సమస్య తీరినట్లే...

**మండపేట (మనసులో మాట )మే18..** కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామం కొత్తవీధిలో సోమవారం నూతనంగా నిర్మించిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తో లో వోల్టేజ్ సమస్య పరిష్కారం నేటితో తీరిందని ట్రాన్సకో ఏ.ఈ బి. వెంకటేశ్వరరావు మీడియా కు వివరించారు. గత ఏడాదిన్నర కాలంలో కోరుమిల్లి, దాని శివారు చిన్న కోరుమిల్లి గ్రామాలలో మొత్తం ఏడు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. దీంతో పూర్తిగా విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గులు సమస్య లో ఓల్టేజ్ సమస్య తీరి, నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమీప



గృహస్థుడు నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చెయ్యడంతో స్థానికులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీంతో అంగర పోలీస్ స్టేషన్ సబ్ ఇనస్పెక్టర్ హరీష్ కుమార్, తన సిబ్బంది బందోబస్తు మధ్య నిర్మాణం పనులు సోమవారం విద్యుత్ సిబ్బంది శరవేగంగా పూర్తి చేసారు. లో ఓల్టేజ్ సమస్య ఈ రోజు నుండి పూర్తిగా తీరిందని ఎమ్ ఎల్ ఏ వేగుళ్ళ జోగేశ్వర రావు కు కొత్తవీది మహిళలు ధన్య వాదాలు తెలిపారు.కోరుమిల్లి, టేకి, మాచర గ్రామాల లైన్ మెన్ లు వి ఎల్ ఎస్ నారాయణ, జానకి రామయ్య, రమణ , అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.



## చిడిగ ప్రమాద భాదితులకు బిల్డింగ్ సంక్షేమబోర్డు ద్వారా పరిహారం చెల్లించాలి

### - సి.ఐ.టి.యు డిమాండ్

**కాకినాడ (మనసులో మాట) మే 18..** కాకినాడ రూరల్ చీడిగ గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో మరణించిన ఉపాధిహామీ కార్మికులకు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద పరిహారం ఒక్కొక్కరికి 5 లక్షల 20 వేలు ఇప్పించాలని కోరుతూ ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ లో వినతి పత్రం జిల్లా కలెక్టర్ కి అందించారు. ఈ సందర్బంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్ కుమార్, ఐరెడ్డి రామ వెంకటేష్ మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలంలో చీడిగ గ్రామం వద్ద 16 వ తేది శనివారం తెల్లవారు జామున టిప్పర్ లారీ ప్రమాదంలో చనిపోయిన 6 గురు ఉపాధి కూలీల కుటుంబాలకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు నుండి ప్రమాద మరణ పరిహారం 5 లక్షల 20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నందు 53 రకాల నిర్మాణ వృత్తులు చేసి జీవనం సాగించే కార్మికులలో ఉపాధి హామీ కార్మికుల కూడా సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వమే చేర్పించిందని, గతంలో అనేక సంక్షేమ పథకాలు 2019 వరకు ఉపాధి హామీ కార్మికులకు అమలు జరిగాయన్నారు. 2021 లో అప్పటి ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ ఇప్పటి కూటమి ప్రభుత్వం 2026 మార్చి ఒకటి నుండి అమలులోకి తీసుకు వచ్చిన సందర్బంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ఆదుకోవలన్నారు. కేవలం సంతాపం ప్రకటించడం వల్ల ఒరిగేది ఏమి ఉండదని, కార్మికులు దాచుకున్న సొమ్ము 3 వేల కోట్ల నుండి సంక్షేమ బోర్డు ద్వారా మరిన్ని పథకాలు అమలు చేయడం ద్వారా కార్మికులను ఆదుకోవలన్నారు.

## మృతుని కుటుంబానికి రూ.50 వేలు సాయం



**తాడేపల్లిగూడెం (మనసులో మాట), మే 18 :** పట్టణంలోని 32వ వార్డు కడకట్లకు చెందిన జనసైనికుడు యేసు మృతి చెందడంతో అతని కుటుంబానికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ చేతుల మీదుగా సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ఎవరికి ఆపద వచ్చినా పెద్ద మనసుతో ఆదుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ ను అభినందించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ పార్టీ, ప్రజల కోసం నిస్వార్ధంగా పనిచేస్తున్న జనసేన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. బీజేపీ నేత ఈతకోట తాతాజీ, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి పాలూరు వెంకటేశ్వరరావు,, పెంటపాడు మండల జనసేన అధ్యక్షుడు పుల్ల బాబి, కూటమి నాయకులు మద్దాల మణికుమార్, అయినం బాలకృష్ణ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### ప్రజలను మోసం చేయడం లో చంద్ర బాబు సిద్ధహస్తుడు - రాష్ట్ర సబ్ ఆర్డినేటరీ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ, తోట త్రిమూర్తులు




**మండపేట (మనసులో మాట) మే 18** పెట్రోల్ డీజిల్ ధరలు పెంపు ను నిరసిస్తూ వైయస్సార్ పార్టీ నేతృత్వంలో సోమవారం ధర్నా, నిరసన ప్రదర్శన, మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలిచ్చి అందలం ఎక్కిందని రాష్ట్ర సబ్ ఆర్డినేటరీ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ, మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ తోట త్రిమూర్తులు అన్నారు. తొలుత మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసీపీ కార్యాలయం నుండి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వం లో నియోజక వర్గం వ్యాప్తంగా ఉన్న వైసిపి క్యాడర్ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కలవపువ్వు సెంటర్, కెపి రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం కు చేరుకున్నారు. అక్కడ ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం లో డిప్యూటీ తహసీల్దార్ మెహర్ బాబా కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మీడియా తో మాట్లాడారు. హామీలు గాలికి వదిలేసిన ప్రభుత్వాన్ని నిలదీశారు. మోసం చేయడం లో చంద్ర బాబు సిద్ధహస్తుడని విమర్శించారు. ప్రజలను మోసం చేయడం లో దిట్టగా అభివర్ణించారు. ప్రజల పక్షాన తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష స్థానం లో ఉండి ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తమ పాలన ఏమి చేసినా ఈ ఐదేళ్లు ప్రజలు నోరు మూసుకుని ఉంటారని భావిస్తూ ప్రజలను వంచిస్తుందన్నారు. రైతులను దారుణం గా ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. రైతులకు ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం ఈ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. గతంలో వైసీపీ అధికారం లో ఉండగా జగన్ రైతులకు పంట నష్టం తక్షణమే ఇచ్చేవారన్నారు. ఇప్పుడు అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందన్నారు. బీసీ లందరికీ 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. ఆడపిల్లలకు 18ఏళ్లు నుండి 65 ఏళ్లు వరకు నీకు 15, నీకు 15 వేలు అంటూ ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు గానీ ఎక్కడ ఇస్తున్నారో ఇంతవరకు చెప్పలేదని ఎం ఎల్ సి తోట విమర్శించారు. నిరుద్యోగ యువత కు నెలకు మూడు వేలు రూపాయలు ఇస్తానని చెప్పిన హామీ అటకెక్కిందనీ విమర్శించారు. కాపు నేస్తం పథకం లో ప్రతి ఏడాది జగన్ రూ 15 వేలు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదని దుయ్యబట్టారు. తొమ్మిది వేల కోట్ల రూపాయలు కాపు కార్పొరేషన్ కు ఇవ్వాల్సి ఉండగా ఒక్క రూపాయి నిధులు కేటాయించకుండా మోసం చేశారని పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో ఎస్ సి, ఎస్ టి బీసీ మైనార్టీ లకు న్యాయం చేయలేదని ధ్వజం ఎత్తారు. చంద్రబాబు పాలన చెప్పేదొకటి, చేసేదొకటి గా ఉందన్నారు. ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేయడం ఆయనకి అలవాటే అని పేర్కొన్నారు. దుర్మార్గమైన చంద్ర బాబు పాలన ను ప్రజలు సాగనంపాలని కోరారు. అంతర్జాతీయం సంక్షోభం తో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పటికీ కేంద్రం డీజిల్, పెట్రోల్ ధరలు పెంచిందని ఈ క్రమంలో రాష్ట్ర పభుత్వం వసూలు చేసే పన్నులు మినహించుకుంటే ప్రజలపై ఇంధన భారం పడేది కాదన్నారు. ఆక్వా రైతులు కుదేలు అయ్యారని పేర్కొన్నారు. వారికి డీజిల్, పవర్ సబ్సిడీ పై ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ తుంగలో తొక్కిందన్నారు. ఇన్పుట్ సబ్సిడీ జగన్ ఇచ్చేవారనీ, ఇన్సూరెన్స్ వైసిపి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ రాష్ట్రం లో ఆక్వా సీడ్ ధరలు పెంచడం వలన రైతులపై రూ పదివేల కోట్లు భారం పడుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాడుతూ ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ కి అనూహ్య మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. మండపేట నియోజకవర్గం లో వైసీపీ నాయకులు కార్యకర్తల నుండి ఈ ఆందోళన కార్యక్రమాన్ని విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం, మాజీ ముఖ్య మంత్రి జగన్ పిలుపు మేరకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి, కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సాయి బాబా, మాజీ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీలు కుడిపూడి రాంబాబు, మేడిశెట్టి దుర్గారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీలు వల్లూరు రామకృష, నియోజకవర్గ పరిశీలకులు ఒంటెద్దు వెంకన్న నాయుడు, కపిలేశ్వరం ఎంపీపీజిత్తుగ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ పుట్టపూడి వీర వెంకట సత్యనారాయణ మూర్తి(అబ్బు ),మండల కన్వీనర్స్ అడబాల బాబ్జి, గూటం సత్యనారాయణ, రాష్ట్ర రైతు విభాగ ఉపాధ్యక్షులు కొవ్వూరు త్రినాథ్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు సిరిపురం శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల, సుధాకర్, మాజీ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి, గారపాటి అశోక్ కుమార్, పొతంశెట్టి ప్రసాద్, వాసిరెడ్డి అర్జున్, సన్మాల ధనరాజు, జొన్నపల్లి సత్తిబాబు, వనుము నారాయణ, పెంకే వెంకట రావు, పోతుల ప్రసాద్, శ్రీ శ్రీ, సురేష్, కొప్పిరెడ్డి ప్రసాద్ , ఆలీఖాన్ బాబా, మారిన సత్యనారాయణ, కవల శ్రీను, కొప్పిశెట్టి రామకిషోర్, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అబ్బారెడ్డి వీర్రాజు, జిల్లా కార్యదర్శి టేకుముడి శ్రీనువాసు, తాతపూడి సుబ్రమణ్యం, పలివెల రామకృష్ణ, చింతా సుబ్బారెడ్డి, పోతంశెట్టి సాయిరాం మోహన్ రెడ్డి, పోతంశెట్టి సత్యనారాయణ రెడ్డి, పాలిక శ్రీను, రాధాకృష్ణ, సూరంపూడి సత్యప్రసాద్ సలాది వీరబాబు, సుదర్శన్, ఉండ్రాజవరపు అర్జున్, సయ్యద్ రబ్బానీ, ముక్కా దళియ్యా, పోలమల సత్తిబాబు, పాలపర్తి ప్రవీణ్, ఓగిరాల దేవి , సాధనాల శివ భగవాన్, యారమటి వెంకన్న బాబు, సయ్యద్ రబ్బానీ,మండపేట నియోజకవర్గానికి చెందిన అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ వార్డ్ నెంబర్స్, మాజీ కౌన్సిలర్ అన్ని విభాగాలకు చెందిన నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డీజిల్, పెట్రోల్ ధరల పెంపుపై వైఎస్సార్ సీపీ నిరసన




**కాకినాడ (మనసులో మాట) మే 18..** ఇంధన ధరలు పెంపుపై ప్రజలు,పార్టీ కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం నిరసన తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి,అనంతరం పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో ఎస్. మల్లిబాబుకి వినతిపత్రం అంద చేసారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు సాధ్యం కాని హామీలను ఇచ్చి, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే చంద్రబాబుతో మాట్లాడి ధరలు తగ్గిస్తామని, నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తామని ప్రగల్భాలు పలికారు. కానీ నేడు రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 112 రూపాయలు నుంచి రూ. 113 రూపాయలు పైగా పలుకుతోందన్నారు . దేశంలోనే అత్యధిక ధరలు ఇక్కడ ఉండటం ఎవరి అసమర్ధతో కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసిందని, ఈ మోసాన్ని, వెన్నుపోటును ప్రజలంతా గమనిస్తున్నారని వ్యాఖ్యనించారు . తక్షణమే పెంచిన ధరలను తగ్గించి, సామాన్యుడి జీవన విధానాన్ని మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. ప్రజలను తక్కువ అంచనా వేస్తే చూస్తూ ఊరు కోరని హెచ్చరిస్తూ ప్రజలు చాలా చైతన్యవంతులని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ వై.యస్.ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి కుమార్, కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యా సాగర్ కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ కార్పొరేటర్లు, రాగిరెడ్డి బన్నీ, కంపర బాబి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# కోరుమామిడిలో ఆందోళన కలిగిస్తున్న భూ ఆక్రమణలు

- కమ్యూనిటీ స్థలం ఆక్రమణ, వ్యక్తిగత ఇల్లు కూల్చివేతపై వరుస ఫిర్యాదులు
- గతంలో కలెక్టరేట్ లో ఆంబేద్కర్ యువజన సంఘం ఫిర్యాదు
- నిడదవోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- తాజాగా సోమవారం పీజీఆర్ఎస్ లో బాధితుడు చంటిబాబు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు



**తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి (మనసులో మాట), మే 18:** తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామంలో వరుసగా భూ ఆక్రమణలు జరగడం పట్ల బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకే గ్రామంలో పక్కపక్కనే ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ స్థలం ఆక్రమణ, వ్యక్తిగత ఇల్లు కూల్చి అక్రమ నిర్మాణం చేపట్టడంపై రెండు వేర్వేరు ఫిర్యాదులు పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొందరు వ్యక్తులు ఇలా అక్రమంగా వ్యవహరించడం పట్ల బాధితులు నిరసన తెలియజేస్తున్నారు. ఇటువంటి అక్రమాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు. ఒకే చోట పక్కపక్కనే ఉన్న అంబేద్కర్ యువజన సంఘానికి చెందిన కమ్యూనిటీ స్థలం, ఒక ఇల్లు కూడా ఆక్రమణకు గురవడం కలకలం రేపుతోంది. గ్రామంలోని 66వ సర్వే నెంబర్‌లో ఉన్న కమ్యూనిటీ స్థలం, అంబేద్కర్ విగ్రహం ఉన్న ప్రభుత్వ భూమిలో కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని కోరుమామిడి గ్రామ ఆంబేద్కర్ యువజన సంఘం సభ్యులు రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని కలెక్టరేట్ లో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో గతంలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేస్తున్నారని, ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వద్ద ఎటువంటి టైటిల్ పత్రాలు లేవని, ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని కాపాడాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండు చేశారు. ఈ ఫిర్యాదుపై సంఘ సభ్యులు సంతకాలు చేసి ఫోన్ నెంబర్లు జత చేశారు. అలాగే తన ఇల్లు అక్రమంగా కూల్చివేశారని అదే గ్రామానికి చెందిన పాతగోలుసుల చంటిబాబు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన ఇల్లు కూలగొట్టి ఇంటి స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారంటూ ఆయన ఫిర్యాదు ఇచ్చారు. కోరుమామిడి గ్రామంలో డోర్ నెం. 1-1 లిసర్వే నెం. 2147670000018లో పూర్వీకుల నుంచి వస్తున్న ఇల్లు, స్థలం ఉందని తెలిపారు. 45 ఏళ్ల క్రితం తన నాన్నమ్మ పాత గొలుసుల మాణిక్యం నిర్మించిన ఇల్లు అదేనని, తన నాన్నమ్మ మరణానంతరం తనకు వారసత్వంగా సంక్రమించిందని పేర్కొన్నారు. కొంతమంది తన ఇంటిని దౌర్జన్యంగా కూల్చివేసి ఆ స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. కొవ్వూరు డిస్ట్రిక్ట్ కోర్టులో ఏఎస్ నెంబరు 19/2017గా తాను కోర్టులో వేసుకున్న ఇంజక్షన్ ఆర్డర్ ను సాకుగా చూపి అవతలి వారు ఆక్రమణకు దిగారని, వాళ్లకి ఎటువంటి హక్కు పత్రం లేకుండా నిర్మాణం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఏళ్ళతరబడి పంచాయతీకి ఇంటి పన్ను కడుతున్న రశీదులు కూడా తన వద్ద ఉన్నాయని, ఇవన్నీ తెలిసి కూడా పంచాయతీ కార్యదర్శి ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారనేది అర్థం కావడం లేదని చంటిబాబు విచారం వ్యక్తం చేస్తున్నారు. తన ఇల్లు పడగొట్టిన వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని చంటిబాబు కోరారు. ఒకే గ్రామంలో వరుసగా భూ వివాదాలు, ఆక్రమణ ఆరోపణలు రావడంతో కోరుమామిడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారణ జరిపించి ప్రభుత్వ భూమి, వ్యక్తిగత ఆస్తుల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# మహిళల సాధికారత పేరుతో దందా... ?

## దుమ్ములపేట మహిళా సంఘాల్లో సి వో తణుకు సూరిబాబు వేధింపుల కలకలం కలెక్టర్‌కు ఫిర్యాదు...



**కాకినాడ (మనసులో మాట) మే 18..** కాకినాడ నగరంలోని 10వ డివిజన్ దుమ్ములపేట ప్రాంతంలో మహిళా స్వయం సహాయక సంఘాల వ్యవస్థలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న ఘటనలు ప్రస్తుతం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశం గా మారాయి. మహిళల ఆర్థిక సాధికారత కోసం పనిచేయాల్సిన వ్యవస్థలోనే వేధింపులు, ఒత్తిళ్లు, అక్రమ వసూళ్లు,అధికార దుర్వినియోగం జరుగు తున్నాయంటూ బాధిత మహిళలు ముందుకు రావడం సంచలనంగా మారింది. సోమవారం జిల్లా కలెక్టర్ హరీందర్ ప్రసాద్ కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు దేవి మాట్లాడుతూ, దుమ్ములపేటకు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకుడు మూగు రాజు ఒత్తిడి చేసి సుమారు రూ.5 లక్షల రూపాయలు తీసుకున్నాడని ఆరోపించారు. అదే సమయంలో సిటీ మిషన్ మేనేజ్‌మెంట్ , మానిటరింగ్ కార్యాలయ మేనేజర్ వెంకటరాజు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ గా పనిచేస్తున్న తణుకు సూరిబాబు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, భయపెట్టి, మోసం చేసి పలు పత్రాల పై సంతకాలు చేయించుకున్నాడని పేర్కొన్నారు. అంతేకాకుండా, తన స్థానంలో మూగు రాజు మేనకోడలిని నియమించారని ఆరోపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఆర్పీల నియామక వ్యవస్థను రాజకీయ ప్రభావాలకు వేదికగా మార్చారని ఆమె ఆరోపించారు. డ్వాక్రా సంఘాల కార్యకలాపాల్లో చురుకుగా పనిచేసిన వారిని పక్కనపెట్టి, ఆర్థిక లావాదేవీలు, రాజకీయ అనుబంధాల ఆధారంగా నియామకాలు జరుగుతున్నాయనే వారు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం పై దుమ్ములపేటకు చెందిన జనసేన పార్టీ 10వ డివిజన్ బాధ్యుడు మోసా యేసేబు స్పందిస్తూ, కూటమి ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మూగు రాజు వంటి వ్యక్తుల చర్యలు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాల్సిన రాజకీయ నాయకులే వారిని మోసం చేసి రూ.5.5 లక్షలు వసూలు చేయడం దారుణమని విమర్శించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పోలీసు అధికారి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు,

పార్లమెంట్ సభ్యుడు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్,ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌లకు కూడా ఫిర్యాదులు అందజేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారం లో మరో కీలక అంశం మహిళా స్వయం సహాయక సంఘాల నిధుల వినియోగం పై వస్తున్న ఆరోపణలు. గైగోలుపాడు, మాధవపట్నం ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాల పేర్లతో బ్యాంకు ఖాతాలు తెరచి నిధుల మళ్లింపులు జరిగాయనే ప్రచారం ఇప్పటికే స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో సమన్వయ నిర్వాహకుడి వ్యవహార శైలిపై పూర్తి స్థాయి ఆర్థిక, పరిపాలనా విచారణ జరగాలన్న డిమాండ్ పెరుగుతోంది. మహిళా ఆర్పీలు భయాందోళనల మధ్య పనిచేయాల్సి వస్తోందని, ప్రశ్నించిన వారిపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయని సంఘాల వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంటి చిరునామాలు సేకరించడం, వ్యక్తిగత వివరాలపై విచారణ చేయడం, అనుచితంగా మాట్లాడడం వంటి అంశాలు మహిళల్లో భద్రతా ఆందోళనలు పెంచుతున్నాయని తెలుస్తోంది. ఇక బాధితులకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్పందిస్తారనే నమ్మకం తమకు ఉందని ఫిర్యాదుదారులు తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న తణుకు సూరిబాబు, మూగు రాజు చర్యలు పట్ల అధికార యంత్రాంగం మండిపడుతోంది,

మహిళల సాధికారత కోసం ఏర్పాటైన వ్యవస్థల్లోనే ఇలాంటి ఆరోపణలు రావడం పరిపాలనా వ్యవస్థకు సవాలుగా మారింది. ఆరోపణలు నిజమైతే ఇది కేవలం వ్యక్తిగత అవినీతి వ్యవహారం కాకుండా, మహిళా స్వయం సహాయక సంఘాల వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసే అంశంగా మారే అవకాశముందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి, కలెక్టర్ ను కలిసి పిర్యాదు చేసిన వారిలో దాసరి వీరబాబు, ఆర్పీలు జ్యోతి, కొండమ్మ , ఝాన్సీ పేర్ల.లత, మోస ఆనంద్, ప్రసాద్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను నాణ్యతతో నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలి

## పీజీఆర్ఎస్ కు 313 అర్జీలు - జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ (మనసులో మాట) మే 18..** పీ.జీ.ఆర్.ఎస్ కార్యక్రమం లోసోమవారం అందిన సమస్యలకు జవాబు దారీతనంతో సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, సీపీవో పీ త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, డీఎల్డీవో వాసుదేవ రావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డుల లోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువల పై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 313 అర్జీలు అందాయన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం లో అందిన అర్జీలను నాణ్యతతో నిర్ధేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలోను, రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా ఆడిట్ నిర్వహిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం లో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. అర్జీలు పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

**రెవెన్యూ క్లినిక్ కు 43 అర్జీలు..**

రెవిన్యూ శాఖలో సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలుపైన జరిగింది. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ డీఆర్వో టి తిప్పే నాయక్ కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్. మల్లి బాబు, ఎన్ శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి రత్నమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్ లైన్ లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22 ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 43 అర్జీలు అందాయని జేసీ అపుర్వ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లతో అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి ఈ అర్జీలను సకాలంలో పూర్తిగా పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జలధార జలహారతి పనులన్నింటినీ గ్రౌండింగ్ పూర్తి చేసి

# జూన్ 30 నాటికి పనులు పూర్తి చేయాలి..

### క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్..

**కాకినాడ (మనసులో మాట) మే 18..** జిల్లాలో జలధార జలహారతి కార్యక్రమం కింద మంజూరైన పనులన్నింటినీ వెంటనే గ్రౌండ్ పూర్తి చేసి జూన్ 30 నాటికి తప్పని సరిగా పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ డ్వామా, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, జీఎస్డబ్ల్యూ జిల్లా స్థాయి అధికారులతో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలు ఇతర సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఉపాధి పని దినాల సంఖ్య, సగటు కూలీ వేతనం, జలధార జలహారతి పనుల పురోగతి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా ఓహెచ్ఎస్ఆర్ కింద చేపట్టిన పనులు, తాగు నీరు సరఫరా, నిరుద్యోగ యువతకు కౌశలం కార్యక్రమం కింద పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జల ధార జల హారతి కార్యక్రమం పై రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. ఈ నేపథ్యం లో జిల్లాలో చేపట్టిన పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి మంజూరైన పనులన్నీటికి వెంటనే గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, మంజూరైన పనులన్నింటినీ తప్పనిసరిగా జూన్ 30 నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. పనులు పూర్తయిన వాటికి వెంటనే బిల్లులు అప్లోడ్ చేయాలని సూచించారు. మండలాలవారీగా ఉపాధి పని దినాల సంఖ్య లక్ష్యానికి అనుగుణంగా పెంచాలన్నారు. ఉపాధి కూలీల సగటు వేతనం రూ.280 కంటే తక్కువ కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖలో ఓహెచ్ఎస్ఆర్ కింద చేపట్టిన పనులలో పురోగతి కనబరచాలన్నారు. జిల్లాలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ఎప్పటి కప్పుడు తాగు నీరు ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ పనులు చేయాలన్నారు. తాగునీరు సమస్యలు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగు నీరు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య శిక్షణ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న కౌశల కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం పై స్థానిక నిరుద్యోగ యువతకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి, సచివాలయం స్థాయిలో నిర్వహించే పరీక్షకు హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, విలేజ్ హెల్త్ క్లినిక్, పల్లి పండుగ పంచాయతీ కింద చేపట్టిన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వాట్సప్ గవర్నెన్స్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, ప్రభుత్వ సేవలు వినియోగించుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎండీ మతిన్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీఎస్ శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారిజ.వేణుగోపాల రావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌లో 243 అర్జీలు స్వీకరణ

### - రెవెన్యూ క్లినిక్‌లోనే 116 వినతులు - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మే 18:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో మొత్తం 243 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన ప్రజా సమస్యలను అధికారులు శ్రద్ధగా స్వీకరించి, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజా పరిష్కార మార్గం కోసం అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత అధికారులు తప్పని సరిగా 24 గంటల్లో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు వ్యక్తిగత బాధ్యత వహించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ప్రజలకు సమయ పాలనతో సేవలు అందించడం ప్రతి శాఖ బాధ్యత అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి: రెవెన్యూ (రెవెన్యూ క్లినిక్) 116, పంచాయతీ రాజ్- గ్రామీణాభివృద్ధి 45, హోం 23, పాఠశాల విద్య 11, వ్యవసాయం & సహకారం 6, ఇంధన శాఖ 6, జలవనరులు 6, సాంఘిక సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమలు-వాణిజ్యం, పురపాలక శాఖ, పౌర సరఫరాలు, పశు సంవర్ధక శాఖ, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు తదితర శాఖలకి చెందిన 30 అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌లో మొత్తం 116 అర్జీలు స్వీకరించగా, అందులో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) కు సంబంధించి 22, సాధారణ సర్వేలకు 13, భూ ఆక్రమణల ఫిర్యాదులకు 13, 22 (ఏ) నుంచి తొలగింపు అభ్యర్థనలకు 12, రీ-సర్వే సమస్యలకు 7, ఎఫ్-లైన్ పిటిషన్లకు 7 అర్జీలు అందాయి. అదే విధంగా ఆక్రమణలు, జీఎస్‌డబ్ల్యూఎస్, మీసేవా ఫిర్యాదులు, అసైన్‌మెంట్లు, భూసేకరణ, దేవదాయ, రిజిస్ట్రేషన్ సేవలు, పట్టా సబ్ డివిజన్, ఏజెన్సీ భూముల సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. రెవెన్యూ క్లినిక్ (పీజీఆర్ఎస్) ద్వారా 103, ఏపీ సేవా సర్వీసుల ద్వారా 13 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామ మూర్తి, ఎస్డీసీ లు ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, మహేష్, మనోజ్, సీపీఓ ఎల్ అప్పల కొండ, డీఎస్పీ శివ ప్రియ, డీఎల్ డివో పీ వీణా దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ అప్పుల పాలనతోనే ఇంధన భారం..

### ప్రజలను మభ్యపెట్టేందుకే ధర్నాలు - ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**కాకినాడ (మనసులో మాట) మే 18..** ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ స్థాయి ఆర్థిక అస్థిరతల ప్రభావం తో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం వృథా కాకుండా పొదుపు చర్యలు చేపడుతోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సోమవారం కాకినాడలో స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన లో ఖర్చులను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వ వ్యయాలను తగ్గించే దిశగా సీఎం స్వయంగా తన కాన్వాయ్ ను కూడా తగ్గించు కున్నారని గుర్తు చేశారు. ప్రజాధనాన్ని ఆదా చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు .

ఇక పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ చేస్తున్న నిరసనలు పూర్తిగా రాజకీయ ప్రేరితమైనవని ఎమ్మెల్యే విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపారని ఆయన ఆరోపించారు. అప్పట్లో ప్రజలపై అధిక వ్యాట్ భారం మోపి ఇంధన ధరలు పెరగడానికి కారణమైన వారే ఇప్పుడు ధర్నాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే మండి పడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజా ధనాన్ని అభివృద్ధికి కాకుండా రాజకీయ ప్రయోజనాలకు వినియోగించిందని, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్లిందని ఆయన విమర్శించారు. ఇప్పుడు ధరలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్నారు. ప్రజల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గతంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తోందని, అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే అన్నారు . ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# వైసీపీ ది పబ్లిసిటీ స్టంట్

### పెట్రోధరులు పెంపు కేంద్ర పరిధిలోనిది - గతంలో మీరు చెప్పింది ఏంటి, ఇప్పుడు చేస్తుంది ఏంటి



**కొత్తపేట( మనసులో మాట) మే 18..** పెట్రోల్ ధరలు పెంచడం తగ్గించడం కేంద్ర పరిధిలోని అని గతంలో మీరే సెలవిచ్చారు. ఇప్పుడేమో చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వం పెంపుదలకు కారణం అంటూ ఆందోళన చేస్తున్నా వైసీపీ నేతలకు రోజుకో రకంగా మాట్లాడడం అలవాటయిందని కొత్తపేట టిడిపి నాయకులు అన్నారు. పెట్రోల్ ధరలు ఒక ఏపీలోనే కాదు, దేశవ్యాప్తంగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ సంక్షోభం ఏర్పడింది. యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పెట్రోలుకు డిమాండ్ పెరిగింది. పలు దేశాలు ముందుగానే ధరలు పెంచాయి. ఇండియాలో ఇప్పటివరకు ధరల పెంచలేదంటే ఒక కేంద్ర ప్రభుత్వం సమస్యను ముందుగానే గుర్తించింది...పొదుపు మంత్రం పాటించాలని ప్రజలను కోరింది.. తప్పనిసరి పరిస్థితుల్లో ధరల పెంపు నిర్ణయం జరిగింది. వైయస్సార్ పార్టీ రాజకీయ కారణాలతోనే, పబ్లిసిటీ కోసం పెట్రోల్ ధరలు పెంపు పేరుతో ప్రజల దృష్టి ఆకర్షించడానికి చేస్తున్న ప్రయత్నమే నేడు వైసిపి చేపట్టిన కార్యక్రమని అన్నారు. కొత్తపేట మండలం టిడిపి పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు మండల తెలుగు యువత అధ్యక్షుడు ఇళ్ళ రాము,, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బుల మనోహర్, ఎంపీటీసీ సభ్యుడు చిత్రపు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలి

## పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన అర్జీలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



ఏలూరు, మే, 18(మనసులో మాట).. పిజిఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన అర్జీలు పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయీ అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు.జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి యల్.దేవకీదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, జిల్లా సర్వే సహాయ సంచాలకులు అన్సారీలు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు నుండి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలు అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, ధరఖాస్తుదారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు.అర్జీదారులు కార్యాలయాలు చుట్టూ తిరగకుండా, వారికి సంతృప్తి కలిగే విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను లబ్ధిదారులకు అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదని, సమస్యలు పరిష్కారంలో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులకు శాఖా పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో వచ్చిన అర్జీలు 246 స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

**అందిన అర్జీలలో కొన్ని....**

ఏలూరు శనివారపుపేట కు చెందిన కోరుకొండ శ్రీనివాసరావు తన దరఖాస్తులో తమ ఇంటికి వెళ్లే దారిని శ్రీనివాసరావు అనే వ్యక్తి ఆక్రమణ చేసి గోడను నిర్మించారని, సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు.. పెదవేగి మండలం అమ్మపాలెంకకు చెందిన ఎన్. కాంతారావు తన దరఖాస్తులో తమ ఇంటి స్థలంలో పక్కవారితో సరిహద్దు సమస్యలు ఉన్నాయని పరిష్కరించాల్సిందిగా కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు.నిడమర్రు మండలం గుణపర్రు గ్రామానికి చెందిన ఐ.వి.ఎన్. రంగమన్నారు తన దరఖాస్తులో తమ గ్రామంలో అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వుతున్నారని, నిలుపుదల చేయవలసిందిగా కోరగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. కామవరపుకోటకు చెందిన జి. సత్యనారాయణ తన దరఖాస్తులో కామవరపుకోటలో కోటగట్టు కాల్వపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలియజేయగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ని కలెక్టర్ ఆదేశించారు. కామవరపుకోటకు చెందిన తమ గ్రామంలో పంచాయతీ అధికారులు ఆక్రమణదారులను సమర్థిస్తున్నారని, ఆక్రమణలు తొలగించాలని కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ ని కలెక్టర్ ఆదేశించారు. వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామానికి చెందిన కె. పుల్లమ్మ తన దరఖాస్తులో తన 3 ఎకరాల భూమిని పోలవరం ప్రాజెక్ట్ కు అందించానని, పునరావాస ప్యాకేజి అందించాలని కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని భూసేకరణల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు.



# ప్రజా దర్బార్ లో ప్రజల సమస్యలకు వేగవంత పరిష్కారానికి చర్యలు

### ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హామీ

కాకినాడ (మనసులో మాట) మే 18.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు . సోమవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమం లో ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుండి వినతి పత్రాలను స్వయం గా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగ కుండా ఒకే వేదికపై తమ సమస్యలను వెల్లడించే అవకాశం కల్పించడమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటి కప్పుడు గుర్తించి వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు సమన్వయం తో పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా వితంతు, దివ్యాంగుల పెన్షన్లు, ఇల్లు స్థలాల మంజూరు, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల మరమ్మతులు, డ్రైనేజీల శుభ్రత, రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం దాదాపు 120 అర్జీలు అందాయన్నారు.ప్రతి అర్జీని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వితంతు పెన్షన్లు వంటి ప్రజల నిత్యావసర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్.ఈ. పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, డీఈ లక్ష్మీనారాయణ, శానిటేషన్ సూపర్వైజర్లు నాయుడు, రాంబాబు, హౌసింగ్ ఏడీ, పి-4 సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎటపాక సీఐగా వీ కృష్ణ నియామకం



ఎటపాక ( మనసులో మాట), మే 18: పోలవరం జిల్లా ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ గా వీ కృష్ణ నియమితులయ్యారు. ఈయన సోమవారం ఎటపాక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కాకినాడ జిల్లా కేంద్రం కాకినాడ పట్టణ క్రైమ్ ఇన్స్పెక్టర్ గా పనిచేశారు. ఎటపాక సీఐగా బాధ్యతలు స్వీకరించిన వీ కృష్ణ మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గాని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి చర్యలు చేస్తే సహించేది లేదన్నారు. యువత చెడును వీడి మంచి మార్గంలో నడవాలని సూచించారు. కాగా ఇప్పటి వరకు ఎటపాక సీఐగా విధులు నిర్వహించిన ఎం కనపర్రాజు పోలవరం జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ గా బదిలీ అయ్యారు.

# యువత క్రీడల పట్ల శ్రద్ధ చూపి శారీరిక ఆరోగ్యంతో మానసిక ఉల్లాసం కలిగి ఉండాలి



కాకినాడ (మనసులో మాట) మే 18.. యువత క్రీడల పై శ్రద్ధ చూపించి శారీరిక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంతో కల్గి ఉండాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ బోండా వెంకన్నరావు, తెలుగుదేశం పార్టీ కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షుడు చుంద్రు వెంకన్నరాయ చౌదరి అన్నారు . కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం వేళంగి హైస్కూల్ గ్రౌండ్‌లో వేళంగి ప్రీమియర్ లీగ్ సీజన్-4 '2026' క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆర్గనైజర్స్ దాసరి సురేష్ కుమార్, చింత శ్రీసంతోష్, పస్పీరు సుబ్బారావు, కుంచె మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ కు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ బోండా వెంకన్నరావు, తెలుగుదేశం పార్టీ కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షులు చుంద్రు వెంకన్నరాయ చౌదరి ముఖ్యఅతిధులుగా పాల్గొనగా జనసేన పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ బోండా సూర్యారావు, పైడికొండల ప్రసాద్, సాన శ్రీను లు విశిష్ట అతిధులుగా పాల్గొని టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ క్రీడా సంబరంలో మొత్తం 6 జట్లు తలపడనుండగా, అభిమానులను అలరించేందుకు 34 మ్యాచ్‌లను షెడ్యూల్ చేశారు. ఈ టోర్నమెంట్‌లో మారీ రాయల్స్, మార్కెట్ ఇండియన్స్, కింగ్స్ లెవెన్, పవనిజం లెవెన్, వాకాడ సూపర్ కింగ్స్, డిసి వారియర్స్ జట్లు పాల్గొనగా అతిథులు టాస్ వేసి మ్యాచ్‌లను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతగానో దోహద పడతాయని కొనియాడారు. ఈ టోర్నమెంట్ లో విజేతలకు 12 వేల రూపాయల నగదు బహుమతి, రన్నర్ టీమ్ కు 8 వేల రూపాయల నగదు బహుమతి, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ 2,500 రూపాయలు బెస్ట్ బ్యాట్స్‌మెన్ 1,500 రూపాయలు ఉత్తమ బౌలర్ 1,500రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, క్రీడాకారులు, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు

# జూన్ 5 నుండి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం - ఈఆర్ఓ డి భారతి



పిఠాపురం (మనసులో మాట) మే 18 : పిఠాపురం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి డి భారతి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే జూన్ 5 నుండి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె తెలియపరచిన ఓటర్ సవరణ షెడ్యూల్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి జూన్ 5 నుండి 14 వరకు: ముందస్తు ఏర్పాట్లు, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పత్రాల ముద్రణ.

జూన్ 15 నుండి జూలై 14 వరకు: బూత్ స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహణ.

జూలై 14: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ.

జూలై 21: ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ.

జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు: అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ.

సెప్టెంబర్ 22: తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా ఓటర్ల నమోదు అధికారి డి భారతి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా సాగడానికి ప్రతి రాజకీయ పార్టీ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్లను విధిగా నియమించాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ పివి గోపాలకృష్ణ , కార్యాలయ సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.